


ఆర్ఎన్ఐ/2009/ 28733 స్థాపితం : 2003

# ఆంధ్రనాడు

తెలుగు దినపత్రిక

సంపుటి : 22 సంచిక: 51 తిరుపతి తేది :శుక్రవారం 22 మే 2026 పేజీలు : 08 ధర : రూ.6 PUBLISHED FROM TIRUPATI, CHITTOOR, ANNAMAIAH, ANANTHAPUR DISRICTS



## పశ్చిమాసియా సంక్షోభం వల్ల ప్రజలకు ఇబ్బందులు రావొద్దు

- తొమ్మిది మంత్రిత్వ శాఖల నివేదికల సమర్పణ
- 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్', 'ఈజ్ ఆఫ్ లివింగ్'పై చర్చించినట్లు ప్రధాని మోదీ వెల్లడి
- ఐదు దేశాల పర్యటన వివరాలను పంచుకున్న జైశంకర్

న్యూఢిల్లీ - ఆంధ్రనాడు, మే 21

'వికసిత్ భారత్ 2047' కేవలం ఒక నినాదం కాదని ప్రధాని మోదీ తెలిపారు. దీన్ని ఒక బాధ్యతగా, బలమైన నిశ్చయంగా భావించాలని మంత్రులకు దిశా నిర్దేశం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ గురువారం

- మిగతా 2లో..

## 'స్త్రీ శక్తి' థీమ్‌తో 'మహానాడు-2026'...

- పండుగలా జరపాలన్న చంద్రబాబు
- ఈ ఏడాది మహానాడును 'స్త్రీ శక్తి' థీమ్‌తో నిర్వహించాలని టీడీపీ నిర్ణయం
- మొత్తం 20 తీర్మానాలను ప్రవేశపెట్టాలని పొలిట్ బ్యూరో సమావేశంలో తీర్మానం
- మహానాడును పండుగలా జరపాలని పార్టీ శ్రేణులకు చంద్రబాబు పిలుపు
- ఇంధన పొదుపులో భాగంగా వర్చువల్‌గా జరిగిన పొలిట్ బ్యూరో సమావేశం
- ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించాలని ఆదేశం



అమరావతి - ఆంధ్రనాడు, మే 21

తెలుగుదేశం పార్టీ ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహానాడు ఈసారి 'స్త్రీ శక్తి' థీమ్‌తో జరగనుంది. ఈ మేరకు పార్టీ పొలిట్ బ్యూరో కీలక నిర్ణయం తీసుకుంది. మే 27, 28 తేదీల్లో హైబ్రిడ్ విధానంలో జరగనున్న మహానాడులో మొత్తం 20 తీర్మానాలను ప్రవేశపెట్టాలని తీర్మానించింది. గురువారం నాడు ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు అధ్యక్షతన పార్టీ పొలిట్ బ్యూరో సమావేశం వర్చువల్ పద్ధతిలో జరిగింది. ఇంధన పొదుపు చర్యలలో భాగంగా జరిగిన ఈ సమావేశంలో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి చంద్రబాబు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పాల్గొనగా, మిగిలిన పొలిట్ బ్యూరో సభ్యులు వివిధ ప్రాంతాల నుంచి ఆన్‌లైన్‌లో హాజరయ్యారు. సుమారు రెండున్నర గంటల పాటు సాగిన ఈ సమావేశంలో మహానాడు నిర్వహణ, అజెండాపై సుదీర్ఘంగా చర్చించారు.

- మిగతా 2లో..

## అభివృద్ధి ధ్యేయంగా ప్రగతి పథంలో తుడా

- ముఖ్యమంత్రి దిశానిర్దేశంతో పారదర్శక పాలన
- తుడా ను రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిపాం
- చెప్పిన పనిని చేసి చూపించడమే నా లక్ష్యం.
- తుడా చైర్మన్ గా ఏడాది పాలనపై చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి



తిరుపతి - ఆంధ్రనాడు, మే 21

విజయవంతమైన ఏడాది కాలానికి గాను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కి ఆయన ప్రత్యేక శుభాభినందనలు తెలియజేశారు. తుడా పూర్వ చైర్మన్‌లందరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

గడిచిన ఏడాది కాలంలో అభివృద్దే ధ్యేయంగా, పారదర్శక పాలనతో తుడా అపూర్వమైన మైలురాళ్లను అధిగమించి ప్రగతి పథంలో దూసుకుపోతోంది" అని తుడా చైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా డాలర్స్ దివాకర్ రెడ్డి స్పష్టం చేశారు. దాదాపు ఐదు దశాబ్దాలుగా నలుగుతున్న శెట్టిపల్లి భూ బాధితుల సమస్యకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే శాశ్వత పరిష్కారం చూపడం జరిగిందని,సీఎం ఆదేశాల మేరకు పేద లబ్ధిదారులపై పైసా భారం పడకుండా సుమారు రూ.17.50 కోట్ల రిజిస్ట్రేషన్ ఫీజును ప్రభుత్వమే పూర్తిగా మాఫీ చేసిందని తెలిపారు. ఈ-డిప్ లాటరీ విధానం ద్వారా అత్యంత పారదర్శకంగా 1,711 మంది లబ్ధిదారులకు (1432 హౌస్ సైట్లు, 279 అగ్రికల్చర్ సైట్లు) భూ కేటాయింపులు జరిపి, ఉచితంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. తుడా ఏర్పడి 81 సంవత్సరాలు అవుతున్నా, ఈ ఒక్క ఏడాదిలోనే రికార్డు స్థాయిలో 400 ఎకరాల ల్యాండ్ పూలింగ్ చేశామని, దీని ద్వారా తుడా సంస్థకు రూ. 400 నుంచి

- మిగతా 2లో..



## తిరుపతికి రౌడీయిజం, భూమి కబ్జా, పరిచయం చేసిందే కరుణాకర్ రెడ్డి

### - టీడీపీ నాయకులు

తిరుపతి -ఆంధ్రనాడు, మే 21

మీడియా మిత్రులు సహాయం చేయడానికి భూమిని సర్వే చేయుట కోసం మాత్రమే మేము సహాయం చేశామని తెలుగుదేశం పార్టీ నాయకులైన జె.బి శ్రీనివాసులు, శాప్ చైర్మన్ రవి నాయుడు తెలియజేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో వారు మాట్లాడుతూ కబ్జా గురించి భూమన మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని, కరుణాకర్ రెడ్డి కబ్జా చేసిన స్థలంలోనే ఇల్లు కట్టుకున్నాడని, తిరుపతికి కబ్జా సంస్కృతిని పరిచయం చేసిందే కరుణాకర్ రెడ్డి అని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం జర్నలిస్టులందరికీ ఇంటి స్థలం ఇచ్చేందుకు కట్టుబడి ఉందని, భూమి ఎక్కడుందో చూసి చెబితే మేము జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు తెప్పించే బాధ్యత మాది అని తెలియజేశారు. 2014లో ఎలక్షన్ బూత్ లో రౌడీయిజం చేసిందే కరుణాకర్ రెడ్డి, ఓడిపోతామని అక్కస్సుతో మాజీ ఎమ్మెల్యే వెంకటరమణ కొట్టింది నువ్వు కదా, మీ హయాంలో తిరుపతిలో ఒక్క ఎలక్షన్స్ అయినా ప్రజలు ప్రశాంతంగా ఓటు వేసే విధంగా జరిపించారా అని ప్రశ్నించారు. శాప్ చైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ దొడ్డిదారిన అభినయ్ రెడ్డి డిప్యూటీ మేయర్ అయ్యాడని, బీసీ మహిళ అయిన మేయర్ అధికారాలన్నీ లాక్కొని తానే రోడ్లు వేశానని ప్రచారం. ప్రతినిత్యం కూటమి ప్రభుత్వం పైన, తిరుమల తిరుపతి దేవస్థానం పైన ఆరోపణలు చేస్తున్న కరుణాకర్ రెడ్డి విలువలు లేని రాజకీయం చేస్తున్నాడని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజలకు సేవ చేయడమే కూటం ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తుందని, మా నాయకుడైన సీఎం చంద్రబాబు నాయుడు విలువలతో కూడిన రాజకీయాలు మాత్ర మే నేర్పాడని, మీ నాయకుడు లాగా రౌడీయిజం, దౌర్జన్యం నేర్పలేదని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పులిగోరు మురళి, తాతయ్య గుంట గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్ ఇతర టిడిపి నాయకులు పాల్గొన్నారు.



## దీపం పథకంపై జగన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారు

- మంత్రి నాదెండ్ల ఆరోపణ
- మధ్యాహ్న భోజనం బియ్యంపై విమర్శలు అవగాహనారాహిత్యంతో చేసినవేనని వ్యాఖ్య
- స్పెషల్ ఫ్లైట్లపై మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదు.. రూ.222 కోట్లు ఖర్చు చేశారని విమర్శ
- 5 కిలోమీటర్ల దూరం కోసం హెలికాప్టర్ వాడిన ఘనత జగన్‌దేనని ఎద్దేవా
- అమరావతి రైతుల త్యాగాన్ని గుర్తించకుండా సీఎంపై వ్యాఖ్యలు సరికాదని ఖండన

2లో

## రాయలసీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ జగన్...

- భాస్కర్ అవార్డు గ్యారంటీ: నారా లోకేష్
- తల్లిని, చెల్లిని తరిమేసి బాబాయిని లేపేసిన వ్యక్తి జగన్ అంటూ లోకేష్ ఫైర్
- రాయలసీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ జగన్మోహన్ రెడ్డి అని తీవ్ర విమర్శ
- 2029లోపు కడప స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభిస్తామని హామీ
- కూటమి మధ్య చిచ్చు పెట్టేందుకు వైసీపీ ఫేక్ ఖాతాలతో కుట్ర

అమరావతి - ఆంధ్రనాడు, మే 21

ఇవాళ జగన్ ప్రెస్ మీట్ చూశాక ఆయనకు 'చీటింగ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు' ఇవ్వొచ్చనిపించిందని, ఆయన అద్భుత నటనకు 'భాస్కర్ అవార్డు' గ్యారంటీ అని మంత్రి నారా లోకేష్ ఎద్దేవా చేశారు. కడప అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన, జగన్‌పై, వైసీపీ నేతలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సొంత కుటుంబాన్నే కాకుండా, సొంత జిల్లాను, నియోజకవర్గాన్ని కూడా జగన్ మోసం చేశారని ఆరోపించారు.

**జగన్ కు ఛీటింగ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ఇవ్వొచ్చు**

ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. తల్లిని, చెల్లిని తరిమేశారని, బాబాయిని లేపేసి మరో చెల్లి



కుటుంబానికి అన్యాయం చేసిన వ్యక్తి జగన్ అని విమర్శించారు. "2019లో సొంత బాబాయిని లేపేసింది జగన్. మొదట

- మిగతా 2లో..

## సెప్టెంబర్ కల్లా పనులు

- ఎంపీయులపై సీఎం ఆదేశం



2లో

# పశ్చిమాసియా సంక్షోభం వల్ల ప్రజలకు ఇబ్బందులు రావొద్దు

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర మంత్రిమండలితో సుదీర్ఘంగా సమావేశమయ్యారు. దాదాపు నాలుగున్నర గంటల పాటు ఈ భేటీ సాగింది. మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వానికి ఇది ఒక మధ్యంతర సమీక్షగా నిలిచింది. పశ్చిమాసియా సంక్షోభం, ప్రధాని ఐదు దేశాల పర్యటన, ఇంధన పొదుపుపై పటిష్ఠ చర్యల నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం ఏదో కీలక నిర్ణయం తీసుకోనుందని జోరుగా ప్రచారం జరిగింది.

**పాలనా సంస్కరణలు**

ఈ సమావేశంలో పాలనా సంస్కరణలు, ప్రభుత్వ పనితీరుపై ప్రధానంగా చర్చించారు. తొమ్మిదికి పైగా మంత్రిత్వ శాఖలు తమ ప్రగతి నివేదికలను ప్రధానికి సమర్పించాయి. అలాగే నీతి ఆయోగ్, క్యాబినెట్ సెక్రటరీ కూడా భవిష్యత్తు ప్రణాళికలపై ప్రజెంటేషన్లు ఇచ్చారు. ఫైళ్లను అత్యంత వేగంగా పరిష్కరించిన శాఖలను ఈ సందర్భంగా ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ నిర్ణయాలు వేగంగా అమలయ్యేలా చూడాలని దిశానిర్దేశం చేశారు.

**విదేశీ పర్యటన వివరాలు**

ప్రధాని మోదీ ఇటీవలి ఐదు దేశాల పర్యటన విజయవంతం కావడంపై మంత్రులు ఆయనను సత్కరించారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల విజయాన్ని కూడా ప్రస్తావించారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఈ పర్యటన విశేషాలను వివరించారు. మరోవైపు పశ్చిమాసియా సంక్షోభం, దాని వల్ల వచ్చే ఆర్థిక సవాళ్లపై మోదీ చర్చించారు. ఈ సంక్షోభం వల్ల దేశ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు. రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కొరియాలో, ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా జెనీవాలో ఉన్నందున ఈ భేటీకి రాలేకపోయారు.

# సెప్టెంబర్ కల్లా పనులు

## - ఎంఓయులపై సీఎం ఆదేశం

**అమరావతి – ఆంధ్రనాడు, మే 21**

ఆమోదం పొందిన ప్రాజెక్టు పనులు ఈ ఏడాది సెప్టెంబర్ కల్లా ప్రారంభం కావాలని, ఆయా ప్రాజెక్టులు డిసెంబర్ 2028 కల్లా ప్రారంభమయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. రాష్ట్రం అనుసరిస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని ఆచరణలో చూపాలన్నారు. విశాఖ భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాలు, ఎస్ఐపిబి ఆమోదించిన ప్రాజెక్టులపై మంత్రుల కమిటీతో గురువారం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాజెక్టులకు అనుమతులు, ఉద్యోగాల కల్పనకు కోసం సింగిల్ పోర్టల్‌లో డ్యాష్ బోర్డు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భూ కేటాయింపుల్లో మొదటగా పర్యాటక ప్రాజెక్టులకు, తర్వాత ఐటి కంపెనీలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సూర్యలంక బీచ్ ఫ్రంట్‌ను మరో గోవాగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు చేయాలని, బాపట్ల బీచ్‌కు త్వరలో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 21 ప్రధాన ఆలయాలను కలుపుతూ టెంపుల్ టూరిజం ప్రాజెక్టు వేగంగా చేపట్టాలన్నారు. ?నౌకా నిర్మాణంలో విస్తృత అవకాశాలు షిప్ బిల్డింగ్ సెంటర్ నిర్మాణం, పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సిఎం అన్నారు. నౌకా నిర్మాణ రంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని స్పష్టం చేశారు. ?ట్రాన్స్‌మిషన్‌తో పాటు సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని, రాష్ట్రం నిర్దేశించుకున్న 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యాన్ని వేగంగా చేరుకోవాలని సూచించారు. ఇప్పటికే 99 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ విద్యుత్ ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు తెలిపారు. సర్క్యులర్ ఎకానమీని ప్రోత్సహించేలా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు త్వరితగతిన ఏర్పాటయ్యేలా చూడాలని అన్నారు. 2027 డిసెంబరు నాటికి 46 ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులు ఉత్పత్తి ప్రారంభించేలా నిరంతరం పారిశ్రామికవేత్తలతో సంప్రదింపులు చేయాలని సీఎం సూచించారు. వైద్యారోగ్య రంగ ప్రాజెక్టులు రాష్ట్రంలో ఏర్పాటు కావాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో చేపట్టే ప్రాజెక్టుల్లో పర్యావరణ హిత టెక్నాలజీ వినియోగించాలని చంద్రబాబు సూచించారు. తీరప్రాంతాల్లో సముద్రంలోకి కాలుష్య కారకాలను విడిచిపెట్టకుండా చూడాలని అన్నారు. ఇప్పటి వరకు కుదుర్చుకున్న ఎంఓయూలు, ప్రాజెక్టుల పురోగతిపై ఐటి శాఖా మంత్రి నారా లోకేష్ ఈ సందర్భంగా ప్రజెంటేషన్ ఇచ్చారు.

# ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

**అమరావతి – ఆంధ్రనాడు, మే 21**

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉదయం జరిగిన పరీక్షకు మొదటి సంవత్సరం విద్యార్థులు 93.40శాతం హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 80,728 మంది పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, వారిలో 75,400 మంది పరీక్ష రాశారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 40,703 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 36,350 (89.75శాతం) మంది హాజరయ్యారు. ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి పి రంజిత్ బాషా విజయవాడ పరిధిలోని శ్వస్త జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ప్రకాశం జిల్లాకు చెందిన విద్యార్థి అక్రమాలకు పాల్పడుతూ పట్టుబడటంతో నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఇంటర్మీడియట్ బోర్డు గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది.

# 28న బక్రీద్

**అమరావతి – ఆంధ్రనాడు, మే 21**



రాష్ట్రప్రభుత్వం ఈ నెల 28వ తేదిన బక్రీద్‌ను ప్రకటించింది. ఇందుకు సంబంధించిన జివో 1006ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్ గురువారం విడుదల చేశారు. గతంలో బక్రీద్‌ను ప్రభుత్వం ఈ నెల 27వ తేదిన సెలవు దినంగా ప్రకటించింది. నెలవంక ఆధారంగా ముస్లిం సమాజం బక్రీద్ వేడుకను ఈనెల 27కు బదులుగా 28 గురువారం నిర్వహించుకోనున్నారని విజయవాడ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ముఖ్య కార్య నిర్వహణాధికారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీంతో ఈనెల 27వ తేది సెలవును 28వ తేదీకి మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది.

# 'స్త్రీ శక్తి' థీమ్‌తో 'మహానాడు-2026'...

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా మహానాడులో ప్రవేశపెట్టాల్సిన తీర్మా నాలపై చంద్రబాబు కీలక సూచనలు చేశారు. మొత్తం 20 తీర్మానాలకు పొలిట్ బ్యూరో ఆమోదం తెలిపింది. వీటిలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 10, తెలంగాణకు 4, అండమాన్‌కు 1 తీర్మానం ఉన్నాయి. వీటితో పాటు నాలుగు ఉమ్మడి తీర్మానాలు, చివరగా ఒక కీలక రాజకీయ తీర్మానాన్ని చేపట్టాలని నిర్ణయించారు. ఈ ఏడాది మహానాడును 'స్త్రీ శక్తి' థీమ్‌తో నిర్వహించాలని నిర్ణయించినందున, కార్యక్రమం మొత్తం ఆ స్ఫూర్తిని ప్రతిబింబించేలా ఉండాలని చంద్రబాబు స్పష్టం చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి మహిళా సాధికారతకు, వారి హక్కులకు టీడీపీ కట్టుబడి ఉందని, ఆ విషయాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకంలోనూ మహిళలనే భాగస్వాములను చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. వీటితో పాటు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడుల వంటి



అంశాలపై మహానాడులో కూలంకషంగా చర్చ జరగాలని ఆదేశించారు. 'మన దేశం-మన బాధ్యత' పేరుతో ప్రభుత్వం తీసుకుంటున్న పొదుపు చర్యలపైనా ప్రత్యేకంగా చర్చించాలని సూచించారు. రాష్ట్రంలో 'ప్రత్యర్థి పార్టీ' పేరిట జరుగుతున్న అరాచకాలను, కుట్రలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, వారిలో అవగా హన పెంచేలా మహానాడు కార్యక్రమాలు ఉండాలని పొలిట్ బ్యూరో అభిప్రాయపడింది. ఎన్టీఆర్ సిద్ధాంతాలు, తెలుగుదేశం పార్టీ చరిత్రను నేటి తరానికి తెలియజేసేలా ప్రత్యేక ప్రజెంటేషన్లు ఇవ్వాలని కూడా నిర్ణయించారు. హైబ్రిడ్ పద్ధతిలో ఈసారి మహానాడు జరుగుతున్నప్పటికీ, దాని స్ఫూర్తి మాత్రం తగ్గకూడదని చంద్రబాబు స్పష్టం చేశారు. మహానాడును ఒక పండుగలా నిర్వహించాలని, రెండు రోజుల ముందు నుంచే ప్రతి ఇంటిపైనా టీడీపీ జెండా ఎగరేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అగ్ర నాయకత్వం నుంచి క్షేత్రస్థాయి కార్యకర్త వరకు ప్రతి ఒక్కరినీ ఈ కార్య క్రమంలో భాగస్వాములను చేయాలని ఆదేశించారు. అన్ని క్లస్టర్లలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి మహానాడును ప్రారంభించాలని పొలిట్ బ్యూరో సమావేశంలో నిర్ణయించారు.

# దీపం పథకంపై జగన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారు

**అమరావతి– ఆంధ్రనాడు, మే 21**

మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ చేసిన విమర్శలపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దీపం పథకం, మధ్యాహ్న భోజనం నాణ్యత, ప్రత్యేక విమానాల వినియోగం వంటి అంశాలపై జగన్ పూర్తిగా అసత్యాలు, అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాదెండ్ల మనోహర్ అన్ని విమర్శలకు గణాంకాలతో సహా ఘాటుగా సమాధానమిచ్చారు.

**దీపం పథకంపై పారదర్శకంగా ఉన్నాం**

"దీపం పథకం కింద అర్హులైన వారందరికీ గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని, దీన్ని కూడా జగన్ రాజకీయం చేయడం దారుణం" అని మనోహర్ అన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలల్లోనే నాలుగు విడతలుగా ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేశామని తెలిపారు. ఇప్పటివరకు నాలుగు విడతల్లో దాదాపు 3.77 కోట్ల మంది లబ్ధిదారులకు రూ. 3,037 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశామని వివరించారు. ప్రస్తుతం ఐదో విడత కొనసాగుతోందని, ఇప్పటికే 48 లక్షల మంది బుక్ చేసుకున్నారని చెప్పారు. "ఇది జగన్ ప్రభుత్వంలో లాగా బటన్ నొక్కే కార్యక్రమం కాదు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈకేవైసీ, ఆధార్ అనుసంధానం ద్వారా పారదర్శకంగా అమలు చేస్తున్నాం. రాష్ట్రంలో కోటి 20 లక్షల కనెక్షన్లు ఉన్నా, డబుల్ కనెక్షన్లు, కమర్షియల్ కనెక్షన్లు, అర్హత లేనివి పోగా, అర్హులందరికీ పథకం అందుతోంది" అని స్పష్టం చేశారు.

**మధ్యాహ్న భోజనంపై సవాల్**

డొక్కా సీతమ్మ గారి స్ఫూర్తితో పాఠశాలల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజనంపై జగన్ చేసిన విమర్శలను మనోహర్ తిప్పికొట్టారు. "పొరుగు రాష్ట్రాల్లో ఎక్కువ ధర ఉన్నా, మన రైతులు త్యాగం చేసి ప్రభుత్వానికి నాణ్యమైన బీపీటీ, సోనా మసూరి బియ్యాన్ని అందించారు. క్యూఆర్ కోడ్ ట్యాగింగ్‌తో పండించిన రైతు నుంచి పాఠశాలకు చేరే వరకు ప్రతి దశను పారదర్శకంగా ట్రాక్ చేస్తున్నాం. దమ్ముంటే ఏ పాఠశాలకైనా వచ్చి భోజనం నాణ్యతను పరిశీలించాలని జగన్‌కు నేను సవాల్ విసురుతున్నాను" అని అన్నారు.

**హెలికాప్టర్ వాడిన ఘనత జగన్‌ది**

ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రయాణాలపై జగన్ చేసిన విమర్శలపై నాదెండ్ల తీవ్రంగా స్పందించారు. "ప్రపంచంలోనే అరుదైన రికార్డు జగన్‌కు ఉంది. ఉండవల్లిలోని తన ఇంటి నుంచి 5 కిలోమీటర్ల దూరంలోని అమరావతికి హెలికాప్టర్‌లో వెళ్లిన మహానుభావుడు ఆయన. తన ఐదేళ్ల పాలనలో స్పెషల్ ఫ్లైట్లు, హెలికాప్టర్ల కోసం రూ. 222 కోట్లు ప్రజాధనం ఖర్చు చేసిన జగన్, ఈరోజు ఇతరులను విమర్శించడం హాస్యాస్పదం" అని ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్ పార్టీ పనులకు పార్టీ నిధులతో, వ్యక్తిగత పనులకు తన సొంత సంపాదనతో ప్రయాణిస్తారని, జగన్‌లా కాంట్రాక్టర్లను బెదిరించి ప్రైవేట్ విమానాల్లో తిరగలేదని అన్నారు.

**అమరావతిపై పైశాచిక ఆనందం**

అమరావతి రైతుల త్యాగాన్ని గుర్తించకుండా, ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి జగన్ చేసిన వ్యాఖ్యలను నాదెండ్ల తీవ్రంగా ఖండించారు. "అమరావతి రైతుల క్షోభను చూసి పైశాచిక ఆనందం పొందుతున్నారు. రాజధాని కోసం రైతులు పడిన బాధను, ప్రాణత్యాగాలను విస్మరించి మాట్లాడటం జగన్ అహంకారానికి నిదర్శనం. మూడు గీతలు గీస్తే రాజధాని అయిపోతుందనుకోవడం మూర్ఖత్వం. ఐదేళ్లు సీఎంగా పనిచేసిన వ్యక్తి, కనీస సమాచారం లేకుండా బురదజల్లే కార్యక్రమాలు మానుకోవాలి" అని హితవు పలికారు.

# రాయలసీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ జగన్...

(మొదటిపేజీ తరువాయి)

గుండెపోటు అన్నారు, తర్వాత గొడ్డలి వేటు అని బయటకు వచ్చింది. ఆ తర్వాత దొంగ పేపర్‌లో నారాసుర రక్తచరిత్ర అని రాసి చంద్రబాబు చేతిలో కత్తి పెట్టి ఫోటో వేశారు. కానీ, జగన్ ఎంత మోసగాడో ప్రజలకు అర్థమైంది. అందుకే వైసీపీకి ముద్దుగా గొడ్డలి పార్టీ అని పేరు పెట్టాం" అని లోకేష్ అన్నారు. జగన్ నటన చూస్తే తనకే ఆశ్చర్యం వేస్తుందని, బయట ముద్దులు పెట్టి లోపల గొడ్డలి పోట్లు వేయడం ఆయనకు అలవాటని వ్యాఖ్యానించారు. రాయలసీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ జగన్ అని, రియల్ ఎస్టేట్ వ్యాపారి దస్తగిరిని జగన్ మేనమామ చంపేసి, తమపై కేసులు పెడతామని బెదిరించారని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే భయపడలేదని, ఇప్పుడు కేసులకు భయపడతామా అని ప్రశ్నించారు. కడపలో ఒక పెద్దాయన ఎగిరెగిరి పడుతున్నారని, త్వరలో ఆయన సమయం కూడా వస్తుందని, చట్టాలను ఉల్లంఘించిన వారిని వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

**2029 లోగా కడప స్టీల్ ప్లాంటులో ఉత్పత్తి ప్రారంభం**

జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కడపకు ఒక్క పరిశ్రమ అయినా తెచ్చారా, ఒక్క సాగునీటి ప్రాజెక్టు అయినా పూర్తి చేశారా అని లోకేష్ ప్రజలను ప్రశ్నించారు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోతే బాధితులను పట్టించుకోలేదని విమర్శించారు. "యువగళం పాదయాత్రలో ఇదే కడప గడ్డపై నేను మిషన్ రాయలసీమను ప్రకటించాను. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తానని మాట ఇచ్చి, ఇప్పుడు ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తున్నాం. గత రెండేళ్లలో రూ.లక్ష కోట్ల విలువైన పరిశ్రమలు రాయలసీమకు తెచ్చాం. 2029 ఎన్నికలలోపు కడప స్టీల్ ప్లాంట్‌లో కమర్షియల్ ప్రొడక్షన్ ప్రారంభించే బాధ్యత నేను తీసుకుంటా," అని లోకేష్ హామీ ఇచ్చారు.

**కూటమి మధ్య చిచ్చుకు సైకో బ్యాచ్ కుట్ర**

కూటమి మధ్య చిచ్చు పెట్టేందుకు వైసీపీ సైకో బ్యాచ్ కుట్రలు పన్నుతోందని లోకేష్ ఆరోపించారు. "జనసేన ముసుగులో మనల్ని, టీడీపీ ముసుగులో జనసేనను ఫేక్ అకౌంట్లలో తిడతారు. మనమంతా అప్రమత్తంగా ఉండాలి. కూటమి కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా జగన్ ముఠా కుట్రలను తిప్పికొట్టాలి," అని పిలుపునిచ్చారు. కార్యకర్తే అధినేత అనే నినాదాన్ని తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తోందని, పల్నాడులో తోట చంద్రయ్య వంటి కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు.

**చేసిన మంచిని చెప్పాల్సిన బాధ్యత కేడర్ దే**

రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని లోకేష్ తెలిపారు. పెన్షన్‌ను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచామని, దీని కోసమే ఏటా రూ.35 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మత్స్యకార భరోసా, చేనేత, మరమగ్గాలకు ఉచిత విద్యుత్ వంటి అనేక పథకాలను అమలు చేస్తున్నామన్నారు. 16 వేల టీచర్ పోస్టులు, 6 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీ చేశామని, ఉగాదికి 10 వేల పోస్టులతో జాబ్ క్యాలెండర్ ఇచ్చామని గుర్తు చేశారు. తాము చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని సూచించారు.

**కార్యకర్తలు ప్రజలతో మమేకం కావాలి**

ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేందుకు పాస్‌పోర్టు మాత్రమేనని, కార్యకర్తలు ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకొని మమేకం కావాలని లోకేష్ హితవు పలికారు. టీడీపీ కేడర్‌పై గత పాలకులు పెట్టిన తప్పుడు కేసులను తొలగించే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. "మా చుట్టూ తిరిగితే పదవులు రావు, ప్రజల చుట్టూ తిరిగితే పదవులు వెదుక్కుంటూ వస్తాయి. పనిచేసే వారిని గుర్తించడానికే మైటీడీపీ యాప్ తీసుకువచ్చాం" అని తెలిపారు.

**వర్చువల్ మహానాడును విజయవంతం చేయండి**

అంతర్జాతీయ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని పిలుపు మేరకు ఈసారి మహానాడును హైబ్రిడ్ విధానంలో వర్చువల్‌గా నిర్వహిస్తున్నామని లోకేష్ తెలిపారు. ప్రతి క్లస్టర్‌లో కార్యకర్తలను సమీకరించి మహానాడును విజయవంతం చేయాలని కోరారు. టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తన బాధ్యత మరింత పెరిగిందని, తనకు అప్పగించిన ప్రతి పనినీ చిత్తశుద్ధితో చేస్తానని అన్నారు.

**గ్రూపు రాజకీయాలకు దూరంగా ఉండండి**

నాయకులు, కార్యకర్తలు గ్రూపు రాజకీయాలకు దూరంగా ఉండాలని లోకేష్ గట్టిగా సూచించారు. పార్టీ శాశ్వతమని, గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించవద్దని కోరారు. అధికారం వచ్చిందని అహంకారం చూపొద్దని, ప్రజలు ప్రతి కదలికను గమనిస్తున్నారని హెచ్చరించారు. అందరం కలిసికట్టుగా పనిచేసి 2029లో ఎన్డీఏను గెలిపించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి కోరినట్లు కడపలోని అర్బన్ పాఠశాలలకు మౌలిక వసతులు, చెరువుల ఆధునీకరణకు నిధులు కేటాయించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు.

**కడపలో మంత్రి నారా లోకేష్ 89వ రోజు ప్రజాదర్బార్**

నియోజకవర్గ కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశం అనంతరం నారా లోకేష్ 89వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరించారు. రాష్ట్రంలో బీసీలకు జనాభా దామాషా ప్రకారం విద్య, ఉపాధి, రాజకీయ రిజర్వేషన్లు కల్పించడంతో పాటు కులగణన నిర్వహించి స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. భూనిర్వాసిత కోటాలో నియమితులైన జేపీఏ ఉద్యోగుల సీనియారిటీని యథావిధిగా వన్ టైం బేసిస్ భూ నిర్వాసితుల ప్రాధాన్యత కోటా కింద కొనసాగించాలని రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ భూ నిర్వాసిత రైతుల హక్కుల పరిరక్షణ ఐక్యవేదిక ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. పుంగనూరు పట్టణంలోని ప్రమీలా నగర్ లో రోడ్డు ఆక్రమణకు గురైందని, సర్వే నిర్వహించి దారి ఏర్పాటుచేయాలని పట్టణానికి చెందిన హేమాద్రి కోరారు. కడప జిల్లా, పట్టణంలో బలిజ భవనానికి 50 సెంట్ల స్థలం కేటాయించడంతో పాటు బలిజ కాపులకు ఈడబ్ల్యూఎస్ కింద 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని జిల్లా బలిజ సంక్షేమ సంఘం ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.

## బాదిత కుటుంబానికి ప్రభుత్వం నుండి ఆర్థిక సాయం : ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, మే 21 :** మండలంలోని నేలపల్లి గ్రామంలో నివాసమున్న హరిబాబు అనే వివాహితుడు వ్యవసాయ పనుల నిమిత్తం గత ఏడాది నవంబర్ నెలలో పొలంలోకి వెళ్లి విద్యుత్ షాక్ కు గురై మరణించాడు. అందుకుగాను ప్రభుత్వం చొరవతో విద్యుత్ శాఖ అధికారులు ఐదు లక్షల రూపాయలు ఎక్స్రేసియా ప్రకటించారు. ఆ మొత్తాన్ని బాధితుడి కుటుంబ సభ్యులైన భార్య హరిత, పిల్లలు హేమచంద్ర, కళ్యాణ్ రామ్ కు గురువారం తెలుగుదేశం ప్రభుత్వం అండగా ఉండాలని ఉద్దేశంతో పలమనేరు నియోజకవర్గం శాసనసభ్యులైన ( మాజీ మంత్రి ) ఎన్.అమర్నాథరెడ్డి చేతులు మీదుగా ఐదు లక్షల రూపాయల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రోజారెడ్డి, మురహరిరెడ్డి, రమేష్, రామకృష్ణ, మహదేవయ్య, వేమనారాయణ పాల్గొన్నారు.

## ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరం



**ఆంధ్రనాడు, తిరుపతి, మే 21 :** శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో గురువారం తిరుపతి ప్రకాశం రోడ్-1 సచివాలయంలో పింక్ బస్ ద్వారా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరం జరిగింది. ముందుగా క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై చిత్రపటాల ద్వారా అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాలు, మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతున్నాయి. పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించారు. స్విమ్స్ డైరెక్టర్ కమ్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటి మెడిసిన్ ప్రొఫెసర్ మరియు పింక్ బస్ ప్రాజెక్టు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ అంజు డి ఆదె మార్గదర్శకత్వంలో నోడల్ ఆఫీసర్లు డాక్టర్ భవాని, డాక్టర్ శివసంతోష్ పర్యవేక్షణలో ఈ వైద్య శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నరసింహ ఆచారి, విజయలక్ష్మీ, జ్ఞానశేఖర్, జగదీష్, రవికుమార్, అశోక్ సామ్రాట్, సునీల్ చక్రవర్తి, కుప్పయ్య, ప్రకాశం రోడ్ అర్బన్ పిహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ క్రాంతి కుమార్, పింక్ బస్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ హరిత, డాక్టర్ లావణ్య, ఏఎన్ఎంలు కాంతమ్మ, సుగుణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## దళితుల హక్కుల పరిరక్షణకు టీడీపీ శాంతియుత నిరసన : టీడీపీ మండల అధ్యక్షులు ప్రణీత్ రెడ్డి



**నాగలాపురం – ఆంధ్రనాడు, మే 21:** గత ఐదేళ్లలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో దళితులు తీవ్ర అణచివేతలు, వేధింపులు ఎదుర్కొన్నారని, అలాంటి పరిస్థితులు మళ్లీ పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ దళిత సోదర సోదరీమణులకు అండగా ఉంటుందని నాగలాపురం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ప్రణీత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం సత్యవేడు నియోజకవర్గ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహనికి పూలమాలవేసి నివాళులర్పించి, ప్రణీత్ రెడ్డి ఆధ్వర్యంలో శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపథ్యంలో మండల అధ్యక్షుడు ప్రణీత్ రెడ్డి మాట్లాడుతూ దళితుల అభివృద్ధికి కుటామి ప్రభుత్వం కట్టుబడి ఉందని, దళితులకు త్వరలోనే సబ్సిడీపై రుణాలు అందించడం జరుగుతుందని, ఇప్పటికే వ్యవసాయ పనిముట్లపై దళితులకు 50 శాతం సబ్సిడీతో వివిధ పనిమట్లు నాగలాపురం వ్యవసాయ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని నాగలాపురం మండల దళిత రైతులు వాటిని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పార్థిబాన్, ఎండి కుమార్, శ్రీనివాస యాదవ్, నెల్సన్ మండేలా, మాతయ్య, తిరుపతి, నరేంద్ర రెడ్డి, నాగరాజు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీనివాస 'లంచ' లీలా విలాసం...!

- మామూలిస్తేనే కదిలే ఫైళ్ల చక్రాలులి
- గ్రామ సర్వేయర్లపై తీవ్ర ఒత్తిళ్లులి
- ఫొటోల కోసమే మొక్కుబడి పర్యటనలులి
- ఉన్నతాధికారులకు తక్షణ చర్యల డిమాండ్

**యర్రావారిపాలెం, మే 21, ఆంధ్రనాడు:** మండల సర్వే విభాగం ప్రస్తుతం అవినీతి అరాచకాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయింది. లక్ష్మీనివాసుడైన ఆ 'శ్రీనివాస్' పేరుకు తగ్గట్టే, ఇక్కడ అడిగినంత ఇచ్చుకుంటేనే సామాన్యుడి భూమి ఫైలు ముందుకు కదులుతోంది. క్షేత్రస్థాయిలో తిరిగి ప్రజల సమస్యలు తీర్చాల్సిన సదరు మండల సర్వేయర్, బాధ్యతలను గాలికొదిలేసి తహసీల్దార్ కార్యాలయ ఫ్యాన్ గాలికే పరిమితమయ్యారు. రీసర్వే లాంటి ప్రతిష్టాత్మక పనులను పర్యవేక్షించకుండా, కేవలం ఫొటోల కోసం మొక్కుబడి పర్యటనలు చేస్తూ కాలక్షేపం చేస్తున్నారు. తన పనులను సైతం కిందిస్థాయి గ్రామ సర్వేయర్లపై నెట్టేస్తూ వారిని తీవ్ర మానసిక వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ అవినీతి అధికారి వేధింపులు భరించలేక అటు సిబ్బంది, ఇటు సామాన్య రైతాంగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఈ 'వసూళ్ల రాజా'పై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**అవినీతి కోరల్లో మండల సర్వే**

యర్రావారిపాలెం మండలంలో భూమి కొలతలు, హద్దుల కోసం వచ్చే సామాన్యులు సర్వేయర్ శ్రీనివాస్ పేరు చెబితేనే హడలిపోతున్నారు. కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా చేయి తడిపితేనే తప్ప ఫైలుపై సంతకం పెట్టనని ఆయన భీష్మించుకు కూర్చుంటున్నారని రైతుల వాదన. లంచం ఇవ్వని పక్షంలో లేనిపోని కొర్రీలు పెడుతూ సామాన్యులను ముప్పుతిప్పలు పెడుతు న్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ అక్రమ వసూళ్ల దందా వల్ల నిరుపేద రైతులు, కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారు. లంచం అడగటమే కాకుండా, హక్కుగా ప్రశ్నించిన వారిపై దురుసుగా ప్రవర్తిస్తూ సదరు అధికారి ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యవహరిస్తున్నారని తెలియవచ్చింది.

**క్షేత్ర విధుల్లో ఘోర నిర్లక్ష్యం**

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వే పనుల్లో కూడా ఈ అధికారి నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఎండనక వాననక క్షేత్రస్థాయిలో కష్టపడుతున్న గ్రామ సర్వేయర్లకు అండగా ఉండాల్సింది పోయి, ఆయన మాత్రం కార్యాలయంలోని గది దాటి బయటకు రావడం లేదు. కేవలం ఉన్నతాధికారులకు చూపించుకునే ఫొటోల కోసం ఒకసారి అలా వచ్చి వెళ్తున్నారని క్షేత్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్యాలయంలో కూర్చుని కాలక్షేపం చేయడం వల్లే రీసర్వే ప్రక్రియ మందగించడమే కాకుండా, అనేక సాంకేతిక లోపాలు తలెత్తుతున్నాయని అధికార వర్గాల నుంచి సమాచారం.

**కిందిస్థాయి సిబ్బందిపై తీవ్ర వేధింపులు**

మండల సర్వేయర్ తను చేయాల్సిన పనులను కూడా గ్రామ సర్వేయర్లపై రుద్ది వారిని వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో ఏదైనా పొరపాటు లేదా సాంకేతిక లోపం జరిగితే వెంటనే ఆ నెపాన్ని కింది సిబ్బందిపై నెట్టేసి తను తప్పుకుంటున్నారని సిబ్బంది కూడా అసహనం వ్యక్తం చేస్తున్న పరిస్థితి. సమిష్టిగా పనిచేసి ఫలితాలు సాధించాల్సిన అధికారి ఇలా ఏకపక్షంగా, సర్వాధికారిలా వ్యవహరించడం వల్ల సర్వే విభాగంలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. సిబ్బందిని ప్రోత్సహించాల్సింది పోయి, వారిపై పైఅధికారులకు లేనిపోని ఫిర్యాదులు చేస్తూ మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని సమాచారం.

**మిన్నంటిన సామాన్య ప్రజల ఆగ్రహం**

ఈ అవినీతి అధికారి వైఖరిపై మండల ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. "ఈ అవినీతి అధికారి మాకొద్దు బాబోయ్" అంటూ బాధితులు బాహాటంగానే శాపనార్థాలు పెడుతున్నారు. ఇన్ని ఆరోపణలు, అక్రమాలు కళ్లముందే జరుగుతున్నా ఉన్నతాధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, ఈ వసూళ్ల అధికారిని తక్షణమే ఇక్కడి నుండి బదిలీ చేసి పూర్తిస్థాయి విచారణ జరపాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# శ్రీసిటీని సందర్శించిన మహారాష్ట్ర విద్యార్థులు

- ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ చొరవతో పారిశ్రామిక అభివృద్ధిపై అవగాహన




**శ్రీసిటీ – ఆంధ్రనాడు, మే 21:** కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ చొరవతో 'ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్' యువసంఘం కార్యక్రమంలో భాగంగా మహారాష్ట్రకు చెందిన వివిధ విద్యాసంస్థల నుంచి 50 మంది విద్యార్థులు, అధ్యాపకులు గురువారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ వేగవంతమైన పారిశ్రామిక అభివృద్ధి, ఆర్థిక వ్యవస్థపై ప్రత్యక్ష అవగాహన కల్పించడం లక్ష్యంగా మహారాష్ట్రలోని 29 జిల్లాల నుంచి పర్యటనకు విచ్చేసిన విద్యార్థులకు శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్ కుమార్ సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి చర్చల్లో పాల్గొన్న శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్.రవీంద్ర సన్నారెడ్డి, దేశ సమైక్యతను చాటిచెబుతూ దేశంలోని విభిన్న ప్రాంతాలు, సంస్కృతులు, సాంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేసే ఈ మంచి కార్యక్రమానికి శ్రీసిటీని ఎంపిక చేయడం తాము గౌరవప్రదంగా భావిస్తున్నాం అన్నారు. వెనుకబడిన ప్రాంతం నుంచి అద్భుత ఆర్థిక కేంద్రంగా శ్రీసిటీ పరిణామం చెందిన తీరును వివరిస్తూ, ప్రస్తుతం 31 దేశాలకు చెందిన 250కిపైగా సంస్థలకు నిలయంగా ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, ఖీవీజ+, ఇంజినీరింగ్, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో విశేష అభివృద్ధి సాధించిందని తెలిపారు. పలు ఏసీ కంపెనీల ఏర్పాటుతో ఇండియా 'కూల్ క్యాపిటల్'గా మారిందన్నారు. 80 వేల కోట్ల పెట్టుబడులు, 60 వేల కోట్లకు పైగా ఎగుమతుల సామర్థ్యంతో "మేక్ ఇన్ ఇండియా ఫర్ ది వరల్డ్" లక్ష్యానికి అనుగుణంగా ఉత్పత్తులను తయారు చేస్తూ 75 వేల మందికి పైగా ఉపాధి కల్పిస్తున్నాయని, అందులో దాదాపు సగం మంది మహిళలేనని తెలిపారు. 'యువసంఘం' కార్యక్రమంపై స్పందిస్తూ యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనపై శ్రీసిటీ ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. ముఖాముఖిలో ఎంతో ఆసక్తితో శ్రీసిటీ సామాజిక వసతులు, పారిశ్రామిక అనుకూల వాతావరణం, సుస్థిరత, ఉపాధి అవకాశాలు తదితర పలు అంశాలను తెలుసుకున్న విద్యార్థులు, అనంతరం శ్రీసిటీ పరిసరాలను తిలకించారు. ప్రపంచ శ్రేణి సదుపాయాలు, పేరుగాంచిన పరిశ్రమలు, చక్కని వాతావరణం తమనెంతగానో ఆకట్టుకుందని ఈ సందర్భంగా విద్యార్థులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తమ అధ్యయనానికి, భవిష్యత్ ప్రణాళికలకు ఈ పర్యటన ఎంతో ఉపయోగకరమన్న వారు, తమకు ఆతిథ్యమిచ్చిన శ్రీసిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, "ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్" అనేది భారత ప్రభుత్వంచే ప్రారంభించబడిన వినూత్న పథకం. దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న సాంస్కృతిక సంబంధాల ద్వారా ఐక్యతను పెంపొందించడం, వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల మధ్య సంబంధాలను మెరుగుపరచడం పథకం లక్ష్యం. ఆంధ్రప్రదేశ్ నుంచి తిరుపతి ఐఐటీని కార్యక్రమానికి నోడెల్ ఇన్స్టిట్యూట్‌గా గుర్తించారు.

# సెన్సెస్ సర్వే పగడ్బందీగా చేపట్టండి

- సెన్సెస్ ఆధారంగానే మరో పదేళ్ల పాటు బడ్జెట్ కేటాయింపులు జరుగుతాయి
- కేంద్ర సెన్సెస్ బృందం డీడీసీఓ డిప్యూటీ డైరెక్టర్ గోపాల్ అగర్వాల్



**తంబళ్లపల్లి – ఆంధ్రనాడు, మే 21:** సెన్సెస్ సర్వేను తప్పులు లేకుండా పగడ్బందీగా చేపట్టాలని, సెన్సెస్ ఆధారంగానే మరో పదేళ్ల పాటు బడ్జెట్ కేటాయింపులు జరుగుతాయని ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర సెన్సెస్ తనిఖీ బృందం అధికారి డీడీసీఓ డిప్యూటీ డైరెక్టర్ గోపాల్ అగర్వాల్ సూచించారు. గురువారం డీఎల్డీఓ లక్ష్మీపతి, స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్ జిల్లా ఇంచార్జి విష్ణు ప్రియతో కలసి కేంద్ర బృందం అధికారులు ఏడీసీఓ అసిస్టెంట్ డైరెక్టర్ సుప్రజ్, ఎస్ఐ గ్రేడ్ (1) సునీల్ కుమార్ మీనా బృందం తంబళ్లపల్లిలో పర్యటించారు. సెన్సెస్ సూపర్వైజర్లను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సెన్సెస్ సూపర్వైజర్లతో సెన్సెస్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో చేపడుతున్న బ్లాకుల వారీ సెన్సెస్ సర్వే పురోగతిపై ఆరా తీశారు. ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్ళి 34 ప్రశ్నలతో కూడిన సర్వేను తప్పులు లేకుండా పగడ్బందీగా నిర్దేశిత కాలంలోగా పూర్తి చేయాలని సూచించారు. ఖాళీగా వున్న ఇళ్లు,తాళం వేసి వున్న ఇళ్లను వేర్వేరుగా నమోదు చేయాలని సూచించారు. జన గణన దేశ భవిష్యత్తు ప్రయోజనాలు, సంక్షేమ పథకాలు, ప్రణాళికకు ఉపయోగపడుతుందన్నారు. గత జనాభా లెక్కలకు, ఇప్పటి జనాభా లెక్కలకు భారీ వ్యాత్యాసం వస్తే రీ వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. ఎన్యూమరేటర్లు చేసిన జన గణనను రీ వెరిఫికేషన్ చేసుకుని ఖచ్చితమైన లెక్కింపులు చేయాలని సూచించారు. మండలంలో మొత్తం 13786 ఇళ్ల సర్వే లక్ష్యం కాగా ఇప్పటివరకూ 13566 ఇళ్లు (34193 జనాభా) 98 శాతం సర్వే పూర్తయినట్టు అధికారులు నివేదికల ద్వారా కేంద్ర బృందానికి వెల్లడించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుతో కలసి తంబళ్లపల్లె మండల కేంద్రంలోని మసీదు వీధి, కృష్ణా నగర్, నాగేంద్ర వీదుల్లో జరుగుతున్న జన గణన సర్వే హౌస్ లాక్ లను తనిఖీ చేసి ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సెన్సెస్ సూపర్వైజర్లు ఎంపీడీఓ ఎంవీ ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీఓ మారుతీ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ రవీంద్ర నాయక్, ఏపీఓ ఆంజనప్ప, సర్వేయర్ నాగరాజు, ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



# భూసేకరణ సమస్యలు త్వరగా పరిష్కరించాలి

- రెండు వారాల్లో సమస్యలు పరిష్కరించాలన్న లక్ష్యం
- ఆర్డీఓలకు కలెక్టర్ ఆదేశం



**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 21:** కడప – రేణిగుంట జాతీయ రహదారి నెం.716 నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న ప్రధాన సమస్యలు, అడ్డంకులపై జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావుతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పరిధిలోని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. భూసేకరణ సమస్యలు పెండింగ్‌లో ఉండటంతో పనులకు ఆటంకాలు ఎదురవుతున్నాయని ప్రాజెక్ట్ డైరెక్టర్ వివరించారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్, ఆర్డీఓలు వెంటనే క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి రెండు వారాల్లోగా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అటవీ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న చెట్ల తొలగింపు పనులను వేగవంతం చేసి, కాంట్రాక్టర్ రహదారి విస్తరణ పనులను నిరాటంకంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తిరుపతి డీఎఫ్ఓను సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్డీఓలు, ఎన్‌హెచ్ఏఐ తిరుపతి ప్రాజెక్ట్ డైరెక్టర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# వడ్లకుప్పంను పర్యటించిన ఎంపీడీవో



**నాగలాపురం – ఆంధ్రనాడు, మే 21:** నాగలాపురం మండలం వడ్ల కుప్పం గ్రామపంచాయతీలో పలు సమస్యలపై యువ నాయకుడు కోదండం కుమారుడు తిరుపతి నాగలాపురం మండలం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ప్రణీత్ రెడ్డికి ఫిర్యాదు చేయడంతో వెంటనే గురువారం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీవోతో చర్చించి వెంటనే వడ్ల కుప్పం గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవో శ్రీ తేజస్వినికి కోరారు. విన వెంటనే స్థానిక పంచాయతీ కార్యదర్శి రమణ మూర్తి, వడ్ల కుప్పం యువ నాయకుడు తిరుపతి, గ్రామస్తులతో కలిసి గ్రామంని పర్యటించారు. గ్రామంలో ఉన్న ప్రధాన సమస్యలు త్రాగునీరు, త్రీఫేస్ లైన్ విద్యుత్ లైన్లు, మరమ్మతులకు గురైన విద్యుత్ స్తంభాలు, మురికి కాలవలు నిర్మాణం, పలు అంశాలపై ఫిర్యాదు రావడంతో వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. వెంటనే వీటన్నిటినీ పరిష్కరిస్తానని ఎంపీడీవో తెలిపారు.

# మాజీ మండల అధ్యక్షుడికి ఘన నివాళి

### -రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ



**కేవీబీపురం – ఆంధ్రనాడు, మే 21:** తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షుడు అవసరం బాలకృష్ణారెడ్డి 21వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆయన కుమారుడు, తిరుపతి పార్లమెంటు యువత అధికార ప్రతినిధి అవసరం సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసి సేవా కార్యక్రమాలు చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ బాలకృష్ణారెడ్డి ప్రజలకు అంకితభావంతో సేవలందించిన నాయకుడిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అవసరం సురేష్ రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి నేర్పిన విలువలు, క్రమశిక్షణ, విశ్వసనీయత తమకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని తెలిపారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ పార్టీకి విధేయులుగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో కుమారులు చంద్రశేఖర్ రెడ్డి, మోహన్ రెడ్డి, వైద్యాధికారి రామ్ నాయక్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# మే 30లోపు ఇంటి వివరాల నమోదు తప్పనిసరి

### - మన జనగణన--మన వికాసం" నినాదంతో ప్రజలకు కలెక్టర్ పిలుపు



**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 21:** జనాభా గణన-2027 తొలి దశలో భాగంగా జరుగుతున్న ఇండ్ల జాబితా, ఇండ్ల గణన కార్యక్రమంలో ప్రతి కుటుంబం తప్పనిసరిగా భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 30వ తేదీతో ఎన్యుమరేటర్ల క్షేత్రస్థాయి సర్వే ముగియనున్న నేపథ్యంలో ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఆయన సూచించారు. ఇప్పటివరకు తమ ఇంటి వివరాలు నమోదు చేయించుకోని వారు వెంటనే స్పందించి, ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లకు సరైన సమాచారం అందించాలని ఆయన కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరాలంటే జనగణనలో ఖచ్చితమైన సమాచారం కీలకమని కలెక్టర్ తెలిపారు. జనగణన కేవలం పరిపాలనా ప్రక్రియ మాత్రమే కాకుండా భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలకు పునాది అని ఆయన పేర్కొన్నారు. “మన జనగణన -- మన వికాసం” నినాదంతో ప్రతి ఒక్కరూ మే 30, 2026 లోపు తమ ఇంటి వివరాలు నమోదు చేయించుకొని కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. జనగణనపై సందేహాల కోసం 1855 హెల్ప్‌లైన్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

# లక్ష్మినరసారెడ్డికి 'డాక్టరేట్' ప్రధానం



**గంగవరం, ఆంధ్రనాడు, మే 21 :** మండలంలోని మదరథెరిసా ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబిఏ విభాగపు అధ్యాపకులు పనిచేస్తున్న లక్ష్మినరసారెడ్డికి తమిళనాడుకు చెందిన తిరువావూరు సెంట్రల్ యూనివర్శిటీ డాక్టరేట్ డిగ్రీని ప్రధానం చేసిందని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ రవీంద్రబాబు వెల్లడించారు. మేనేజ్మెంట్ విభాగమునకు సంబందించిన ఫ్రైస్ డిస్కవరీ మేనేజ్మెంట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన తిరువావూరు సెంట్రల్ యూనివర్శిటీ, ఈ డాక్టరేట్ డిగ్రీని అందజేసినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. డాక్టరేట్ అందుకున్నశీదుకు కళాశాల యాజమాన్యం మరియు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. శ్రీ లక్ష్మినరసా రెడ్డి ను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ రవీంద్రబాబు, చైర్మన్ సునీల్, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి, డైరెక్టర్ రాజేందర్ రెడ్డి మరియు హెచ్.ఓ.డి డాక్టర్ వీణా ఇతర విభాగాధిపతులు, అధ్యాపక బృందం అభినందించి శుభా కాంక్షలు తెలియజేశారు. శ్రీ లక్ష్మినరసా రెడ్డి సాధించిన ఈ ఘనత కళాశాలకే గర్వకారణ మని వారు కొనియాడారు.

# పారిశ్రామిక అభివృద్ధికి కృషి




**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 21 :** రేణిగుంట మండలంలో పారిశ్రామిక వాడ అభివృద్ధికి కృషి చేస్తానని శ్రీ కాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గ యువతకు స్థానికంగానే ఉపాధి కల్పిస్తూ, పారిశ్రామికంగా మన ప్రాంతాన్ని ముందంజలో ఉంచడమే మన కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. అందులో భాగంగానే, గురువారం రేణిగుంట మండలం గాజులమండ్యం వద్ద రూ. 85 కోట్ల వ్యయంతో, సరికొత్త సాంకేతికతతో ఏర్పాటు చేసిన హ్యాంగ్యో ఐస్ క్రీమ్స్ నూతన మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను పరమపూజ్య శ్రీమద్ విద్యాధీశ తీర్థ శ్రీపాద వడేర్ స్వామీజీ దివ్య సమక్షంలో ఘనంగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూగతంలో నాన్న స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణ రెడ్డి ఎన్నో పరిశ్రమలను ఇక్కడికి రప్పించి వేలాది మందికి ఉపాధి కల్పించారు. అదే బాటలో, నేడు శాసనసభ్యుడిగా నా చేతుల మీదుగా ఒక ప్రతిష్టాత్మక ఫ్యాక్టరీని ప్రారంభించడం నాకు ఎంతో గర్వంగా ఉంది. రోజుకు 10 లక్షల లీటర్ల ఉత్పత్తి సామర్థ్యంతో నడిచే ఈ యూనిట్ ద్వారా సుమారు 300 మందికి పైగా స్థానిక నిరుద్యోగులకు ఉపాధి లభించనుంది. ఈ భారీ ప్రాజెక్టు మన శ్రీకాళహస్తికి రావడానికి సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, యువనేత మంత్రివర్యులు నారా లోకేష్ కి మరియు పరిశ్రమల శాఖ మంత్రి టి.జి. భరత్ కి ప్రత్యేక కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ మరియు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కి ధన్యవాదాలు. రాబోయే రోజుల్లో మన నియోజకవర్గాన్ని పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



# గోడౌన్లకు మౌలిక వసతులు కల్పనకు జిల్లా స్థాయి కమిటీ ఆమోదం

**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 21:** జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పాక్స్) పరిధిలో ఇప్పటికే నిర్మించిన మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్స్ (గోడౌన్లు)కు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు జిల్లా స్థాయి అమలు కమిటీ ఆమోదం తెలిపింది. గౌరవ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన గురువారం కలెక్టర్ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ గోడౌన్లకు విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు జిల్లా పరిషత్ నిధులతో కల్పించేందుకు, అలాగే ప్రధాన రహదారుల నుంచి గోడౌన్లకు అనుసంధాన రోడ్లు విబి-జీఆర్ఏఎం (ఎన్ఆర్ఈజీఎస్) నిధులతో నిర్మించేందుకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. ఈ చర్యలతో గ్రామీణ స్థాయిలో వ్యవసాయ నిల్వ, రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని అధికారులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి (కన్వీనర్)



నాగవర్ధన, జిల్లా వ్యవసాయ, పశుసంవర్ధక, పంచాయతీ, మత్స్య శాఖల అధికారులు, పీఆర్ ఆర్డీ ఎస్ఈ, జిల్లా పరిషత్ సీఈఓ, విద్యుత్ శాఖ ఎస్ఈ, డీసీసీబీ సీఈఓ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర అమలుపై సమీక్ష

**- ఇంటింటి చెత్త సేకరణ, అమృత్ 2.0 పనుల వేగవంతానికి కలెక్టర్ ఆదేశం**

**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 21 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో మరింత సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అమృత్ 2.0 పనులను వేగవంతం చేయడంతో పాటు స్వచ్ఛ సర్వేక్షన్‌లో జిల్లాకు ఉత్తమ ర్యాంకులు సాధించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ., స్వచ్ఛతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి నెల మూడో శనివారాన్ని 'స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవం'గా నిర్వహించి పారిశుధ్యం, ఈ-వేస్ట్ నిర్వహణ, జల సంరక్షణపై ప్రత్యేక కార్యక్రమాలు చేపటాలని సూచించారు. ఇంటింటి చెత్త సేకరణను పక్కాగా అమలు చేయడంతో పాటు తడి, పొడి, హానికర వ్యర్థాలను




వేరు చేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే దిశగా కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అమృత్ 2.0 పథకం కింద తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి కేంద్రాలు (సేవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్స్), మౌలిక వసతుల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టణ పరిశుభ్రతను మెరుగుపరచడంలో మున్సిపల్ అధికారులు మరింత చురుకుగా వ్యవహరించాలని సూచించారు. అలాగే అన్నా క్యాంటీన్లలో పరిశుభ్రతను కచ్చితంగా పాటిస్తూ నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో జరుగుతున్న పనుల పురోగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, కాళహస్తి, సూళ్లూరుపేట రామ్మోహన్ భాను ప్రకాష్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోజ్ మాండ్, డిఎల్డిఓ గంగాభవాని, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యాంసుందర్, టిడ్కో ఈఈ రాధిక, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి హామీ అమలు

**- లబ్ధిదారునికి ఈ-ఆటో**
**- రూ.3.52 లక్షల ఈ-ఆటో పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్**




**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 21:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు నాయుడుపేటకు చెందిన లబ్ధిదారుడు సురేంద్రకు గురువారం స్థానిక కలెక్టరేట్‌లో మెప్మా ఆధ్వర్యంలో ఈ-ఆటోను జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ స్వయం ఉపాధి అవకాశాల కల్పనకు కట్టుబడి పనిచేస్తోందన్నారు. మార్చి 30న నాయుడుపేటలో నిర్వహించిన టిడ్కో గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ఈ ఈ-ఆటోను అందజేయడం జరిగిందని తెలిపారు. ఇంటికొక్క పారిశ్రామిక వేత్త కార్యక్రమం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు జీవనోపాధి అవకాశాలు కల్పిస్తూ వారి ఆర్థిక స్థితిని మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని అన్నారు. మెప్మా పథకాల ద్వారా పట్టణ పేదలకు ఉపాధి అవకాశాలు, ఆర్థిక సాధికారత కల్పించబడుతున్నాయని కలెక్టర్ తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ-ఆటోను అందుకున్న సురేంద్ర రాష్ట్ర ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వాహనం ద్వారా తన కుటుంబానికి స్థిరమైన ఆదాయం లభిస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఆర్డీఓ దేవేందర్ రెడ్డి, మెప్మా పీడీ జాల ఎఫ్రాయిమ్, నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ ఫజిలుల్లా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మేల్వత్తూరు పీఠాధిపతికి గంగమ్మ జాతరకు ఆహ్వానం



పలమనేరు – ఆంధ్రనాడు, మే 21 : పలమనేరు మున్సిపల్ పరిధిలోని గంటావూరు బీసీ కాలనీలో ఈ నెల 25 నుంచి 27 వరకు జరగనున్న గంగమ్మ జాతరకు విచ్చేయాలని తమిళనాడు రాష్ట్రం మేల్ మరువత్తూరు అమ్మవారి శక్తి పీఠాధిపతి గురువును మర్యాదపూర్వకంగా కలిసి దేవస్థాన కమిటీ చైర్మన్ డాక్టర్ మురుగన్ గురువారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా గంటావూరు తిరుపతి గంగమ్మ దేవస్థాన కమిటీ పీఠాధిపతి కలసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 25న అమ్మవారి శిరస్సు మెరవణి, 26 న అమ్మవారి విశ్వరూప దర్శనం, 27న జలధి కార్యక్రమాలు ఉంటాయని జాతరకు తప్పక విచ్చేయాలని కోరారు.

# ఘనంగా న్యాయవాది దినకర్ జన్మదిన వేడుకలు



**తిరుపతి – ఆంధ్రనాడు, మే 21:** తిరుపతి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ప్రస్తుత తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాది దినకర్ జన్మదిన వేడుకలు తిరుపతి కోర్టు ప్రాంగణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ న్యాయవాది ఎన్. యోగానంద్ఆధ్వర్యంలో న్యాయవాదులు దినకర్ కు శాలువా కప్పి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు న్యాయవాదులందరికీ ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు.

## పాము కాటు చేటు.. సత్వర చికిత్సే ప్రాణ రక్షణ

### - బాధితుడికి భరోసా కల్పించాలి : డా. శ్రీగిరీష




**పీలేరు – ఆంధ్రనాడు, మే 21:** పాముకాటు నిజమైతే అందులో విషం కూడా నిజమేనని, నిర్లక్ష్యం చేయకుండా గంటలోపు ఆస్పత్రికి తీసుకెళ్లి "యాంటీ స్నేక్ వెనం" ఇంజెక్షన్‌తో చికిత్స అందిస్తే బాధితుడి ప్రాణాలను కాపాడవచ్చని తలుపుల పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డా. శ్రీగిరీష తెలిపారు. ఆవులయ్యగారిపల్లెలో నిర్వహించిన "పాము కాటు – చేటు" అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే భారతదేశంలోనే పాముకాటుతో మరణాలు అధికంగా జరుగుతున్నాయని, ఇందుకు అవగాహన లోపమే ప్రధాన కారణమని అన్నారు. పాముకాటుకు గురైన వ్యక్తిని ఆస్పత్రికి తీసుకెళ్లకుండా మంత్రాలు, చెట్టు పసురులు నమ్ముతూ కీలక సమయాన్ని వృథా చేస్తే ప్రాణాపాయం తప్పదని హెచ్చరించారు. చివరి దశలో ఆస్పత్రికి తీసుకువస్తే వైద్యులకు కూడా ప్రాణాలు కాపాడటం కష్టమవుతుందని పేర్కొన్నారు. పాము కాటు పడిన ప్రాంతాన్ని మంచినీటితో శుభ్రం చేయాలని, గాయం వద్ద కోయరాదని, నోటితో విషాన్ని పీల్చరాదని సూచించారు. బాధితుడికి తినడానికి లేదా తాగడానికి ఏమీ ఇవ్వకుండా ధైర్యం చెప్పుతూ, కదలికలు తగ్గించి వెంటనే సమీప ఆస్పత్రికి తరలించాలని తెలిపారు. పాముకాట్లు ఎక్కువగా మోకాలి కింది భాగంలోనే జరుగుతున్నాయని, గ్రామీణ ప్రాంతాల యువకులు ముఖ్యంగా పురుషులే అధికంగా బాధితులవుతున్నారని చెప్పారు. చికిత్స ఆలస్యం అయితే శరీరం నీలిరంగులోకి మారడం, మత్తు, నీరసం, స్పృహ కోల్పోవడం, నోటి నుంచి నురగ రావడం, ఆయాసం, చెమటలు, గుండెదడ వంటి లక్షణాలు కనిపించి ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని డా. శ్రీగిరీష వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఈఓ కొండయ్య, ఏఎన్ఎం కృష్ణమ్మ, సీహెచ్ఓ లావణ్య, హంస తదితరులు పాల్గొన్నారు.




# ఎమ్మెల్యే చేతుల మీదుగా భీమా చెక్కుల పంపిణి

**- మృతుల కుటుంబీకులను పరామర్శించిన ఎమ్మెల్యే**



**పలమనేరు, ఆంధ్రనాడు,మే 21:** పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల సంక్షేమ విభాగం ద్వారా మంజూరైన ప్రమాద భీమా చెక్కులను బాధిత కుటుంబాలకు గురువారం ఆయన అందజేశారు. వీకోట మండలం యాలకల్లు పంచాయతీ వైసీ బండపల్లి గ్రామానికి చెందిన రైతు రామేగౌడు విద్యుత్ షాక్ గురై ఆరు నెలల క్రితం మృతి చెందాడు. దీంతో కుప్పం రెస్కో ద్వారా మృతుడి భార్య వెంకటలక్ష్మికి రూ 5 లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. అదేవిధంగా రామనాథపురం గ్రామానికి చెందిన రాజేంద్ర నాయుడు భార్య రమ గతంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబీకులకు, 5 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. అదేవిధంగా పెద్దపంజాణి మండలం నేలపల్లి గ్రామానికి చెందిన హరిబాబు ప్రమాదానికి గురి కావడంతో మృతుని కుటుంబీకులకు 5 లక్షల చెక్కును ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ .....కార్యకర్తల సంక్షేమం తమ పార్టీకి అత్యంత ప్రాధాన్యమని తెలిపారు. ప్రమాదాల్లో నష్టపోయిన కుటుంబాలకు అండగా నిలుస్తూ, వారికి ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో ఈ భీమా సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాథ్, ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ గజేంద్ర, రెస్కో చైర్మన్ ప్రతాప్, పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, రెస్కో ఎండీ సోమశేఖర్, ఏడి శివకుమార్, తెలుగుదేశం పార్టీ నాయకులు రామచంద్ర నాయుడు, రాంబాబు,కిషోర్ గౌడ్, ఈశ్వర్ గౌడ్, చౌడప్ప, నారాయణ స్వామి,చంద్రశేఖర్, ధీరజ్, శభరీష్,సురేష్, మురుగేష్, హరి, లక్ష్మణ్, విశ్వనాధ్, మైనారిటీ నాయకులు రూహుల్లా, అక్మల్ తదితరులు ఉన్నారు.

**మృతుల కుటుంబీకులను పరామర్శించిన ఎమ్మెల్యే**

వి.కోట మండలం కస్తూరి నగరానికి చెందిన తెలుగుదేశం పార్టీ పంచాయతీ అధ్యక్షులు బాలసుందరం బావ పరంధామయ్య మృతి చెందడంతో ఎమ్మెల్యే ఆయన భౌతిక కాయని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబీకులను ఆయన పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. అదేవిధంగా కల్లుపల్లి గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ సానుభూతిపరులు మౌల ఇటీవల విద్యుత్ షాక్ కు మృతి చెందాడు. దీంతో మండల తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి వెళ్లి ఎమ్మెల్యే వారి కుటుంబీకులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని బాధిత కుటుంబీకులకు ఆయన భరోసా కల్పించారు.

# కమిషనర్ కు వినతి పత్రం ఇచ్చిన ఎల్బీనగర్ వాసులు

**పలమనేరు, ఆంధ్రనాడు, మే 21:** పురపాలక సంఘ కార్యాలయం విడుదల చేసిన వార్డుల పునర్విభజన ముసాయిదా జాబితా ప్రకారం ఇంటి నంబర్లు 25–557 నుండి 25–569/1 వరకు 6వ వార్డులో చేర్చి ఉన్నారు. అయితే ఇందులో కొన్ని ఇండ్లు ముఖ్యంగా 25–557/4, 25–557/15, 25–557/16, 25–557/17, 25–557/18, 25–567/19, 25–558 సంఖ్య గలవి ఎల్బీనగర్ వీధిలో ఉన్నాయి ఇవి 6వ వార్డుకు సుదూరంగా ఎటువంటి సంబంధం లేకుండా ఉన్నాయి. ఇందు వెంట రోడ్డు స్కెచ్ జతపరుస్తున్నాము. మరియు ఓటర్ల సంఖ్యలో కూడా పెద్ద మార్పు రాదు. కనుక ముసాయిదా జాబితాలో సూచించిన 25–557 నుండి



25–569/1నంబర్ గల గృహాలను 6వ వార్డు నుండి 5వ వార్డుకు మార్చవలసిందిగా ఎల్బీనగర్ వాసులు పురపాలక సంఘ కమిషనర్ కు వినతి పత్రం ఇచ్చారు. అంతే కాకుండా ఆర్టీసీ డిపో వెనుక నుండి గంటాఊరు వరకు రోడ్డు గుంతల మయంగా అధ్వానంగా ఉందని ఆ రోడ్డును బాగు చేయాలని కోరారు. ఆ దారిలో నిత్యం లారీలు, టిప్పర్లు రవాణా వాహనాలు తిరుగుతుంటాయని, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు అదే దారిలో వెళుంటారని వీరు తరచూ ప్రమాదాలకు గురవుతుంటారని తెలిపారు. ఇంకనూ వర్షాకాలంలో రోడ్డులో నీరు నిలిచి బురద గుంట లాగా తయారవుతున్నాయని తెలిపారు. కాబట్టి వెంటనే వీటిని పునర్ నిర్మించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఎల్బీనగర్ వాసులు ఎన్. సోమచంద్రారెడ్డి, దొరస్వామి, గురునాథం, విశ్వనాథ్, గోపాలు రమేష్, గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక కేంద్రాన్ని అవినీతి కేంద్రంగా మారుస్తున్న కూటమి ప్రభుత్వం: చింతామోహన్

**తిరుపతి – ఆంధ్రనాడు, మే 21 :** క్యాంప్ బెల్ అనేది అండమాన్ దగ్గర ఉన్న ఒక ప్రాంతం. 4000 మంది ఆదివాసీలు అక్కడ ఉన్నారు. 300 నుంచి 400 సంవత్సరాలు వయసు వున్న చెట్లు ఉన్నాయి. వాటిని అదానీ నరికేస్తున్నారు. సిపోర్టులు, ఎయిర్ పోర్టు నిర్మిస్తున్నారు. మోది మిత్రుడు అదానీ ఒక దేశాన్ని సృష్టించుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. 40 వేల విల్లాలు అదానీ నిర్మిస్తున్నారు. పది లక్షల ఎకరాల భూములు గిరిజనులవి. ఆదివాసీలను అక్కడి నుండి తరిమేస్తున్నారు. ఇది దేశానికి అత్యంత ప్రమాదకరమని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ తెలియజేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఆయన మాట్లాడుతూ టిటిడి శానిటేషన్ భాగంలో అవినీతి రాజ్యమేలు తోంది. కాంట్రాక్టర్లతో లాలూచి పొడి వారి నుంచి ముందే డబ్బులు తీసుకుంటు న్నారు. రెండు రోజుల్లో టెండర్లు ప్రక్రియ ముగించారు. ఇందులో ప్రభుత్వ పెద్దల ప్రమేయం వుంది. క్యూసీ, బీసీ, అనే కొత్త పద్ధతిని తీసుకొచ్చారు. ఎస్సీ, బీసీలకు కాంట్రాక్టు వర్కులు దక్కకుండా అన్యాయం చేశారు. టిటిడి హెల్త్ విభాగంలో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారికి పదివేల రూపాయలు వేతనం ఇస్తూ, 14 గంటలు పాటు కార్మికుల చేత పని చేయించుకుంటున్నారు. ఇది చాలా




దుర్మార్గం. అన్యాయం. ఏపీకి ఆధ్యాత్మిక కేంద్రం అని ముఖ్యమంత్రి అన్నారు. కానీ ఆధ్యాత్మిక కేంద్రం అవినీతి కేంద్రంగా తయారయింది. ట్రైడెంట్, ఒబెరాయ్, దేవలోక్ అనే మూడు సంస్థలకు ఒకొక్క సంస్థకు 30 ఎకరాల చొప్పున, 90 ఎకరాలు టిటిడి భూములు ఇచ్చారు. వారి దగ్గర నుంచి వేల కోట్ల రూపాయలు ముడుపులు తీసుకున్నారు. 90 ఎకరాలు భూ కేటాయింపులు రద్దు చేయాలి. తిరుమలలో పది హోటళ్లు ఇచ్చారు. ఏ ప్రాతిపదికన ఇచ్చారు? ఎవరికి ఇచ్చారు? 12వ పీఆర్సీ అమలు చేయాలని కోరుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఆరు లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఎనిమిది సంవత్సరాలుగా పీఆర్సీ ప్రకటించకపోవడం శోచనీయం. ఆర్టీసీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ తరపున సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నాము. ఆర్టీసీని ప్రైవేటుపరం చేయడానికి వీలు లేదు. ఎలక్ట్రికల్ బస్సులు, గ్యాస్ బస్సులు వద్దు. ఉన్న బస్సులను వాడండి. సరిపోకపోతే కొత్త బస్సులను కొనుగోలు చేయండి. ఆర్టీసీ కార్మికులకు, ప్రజలకు ఇబ్బంది కలిగించే నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి. స్వర్గీయ రాజీవ్ గాంధీ ప్రపంచ యుద్ధాన్ని ఆపిన గొప్ప ధీరుడు అని చింతామోహన్ కొనియాడారు. ప్రెస్ కాన్ఫరెన్స్ కు ముందు మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్ ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి చింతా మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గోపాల్ యాదవ్, రావణ్, శాంతి యాదవ్, తేజోవతి, ముని శోభ సమీఉల్లా తదితరులు పాల్గొన్నారు.

# పీలేరులోని అయ్యప్పనేని చెరువుకు సరికొత్త రూపు

**- ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించడమే లక్ష్యం**

**- నల్లారి కిషోర్ కుమార్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



**పీలేరు – ఆంధ్రనాడు, మే 21:** గురువారం సాయంత్రం అయ్యప్పనేని చెరువును పరిశీలించారు. చెరువును సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన పర్యాటక, వినోద కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో విస్తృతంగా చర్చించారు. చెరువులో పేరుకుపోయిన పూడికను తొలగించడం, చెరువు చుట్టూ సుందరీకరణ పనులు చేపట్టడం, పచ్చదనం పెంపు, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ దీపాల ఏర్పాటు, ప్రజలకు కూర్చునే సౌకర్యాలు కల్పించడం వంటి అంశాలను ప్రాధాన్యంగా చేపట్టాలని సూచించారు.

**పింఛా నది నుంచి నీటి సరఫరాకు ప్రత్యేక ప్రణాళిక**

అయ్యప్పనేని చెరువుకు పింఛా నది నుంచి సుమారు 2.50 కిలోమీటర్ల మేర పైపులైన్ ద్వారా నీరు చేరేలా సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుతో చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు భూగర్భ జలాల మట్టం కూడా మెరుగుపడుతుందని అధికారులు తెలిపారు.

**చిల్డ్రన్ పార్క్, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్**

జిల్లా వాటర్ షెడ్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో చెరువు కట్టపై చిన్నారుల కోసం ప్రత్యేక చిల్డ్రన్ పార్క్, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో కుటుంబాలతో కలిసి సందర్శించదగిన ప్రజా వినోద కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

**అధికారుల అంచనా ప్రకారం:**

పైపులైన్ ఏర్పాటుకు సుమారు రూ.3 కోట్లు చిల్డ్రన్ పార్క్, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు సుమారు రూ.46 లక్షలు వ్యయం కావచ్చని తెలిపారు. జిల్లాలో నీటి వనరుల సంరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని కలెక్టర్ మరియు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

6
ANDHRANADU
TELUGU DAILY
శుక్రవారం
22.05.2026
తిరుపతి – చిత్తూరు
అన్నమయ్య– అనంతపురం
ఆంధ్రనాడు

## “స్థానిక కృషితోనే విశ్వ జీవకోటి క్షేమం”




భూమిపై ఉన్న జంతువులు, మొక్కలు, పక్షులు, కీటకాలు మరియు పర్యావరణ వ్యవస్థల కలయికనే జీవవైవిధ్యం అంటారు. ఇవన్నీ ఒకదానిపై ఒకటి ఆధారపడుతూ భూమిపై జీవన చక్రాన్ని నడిపిస్తాయి. మనం తినే ఆహారంలో 80% మొక్కల నుంచే వస్తోంది. అలాగే, గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 80% మంది తమ ఆరోగ్యం కోసం సాంప్రదాయ వైద్యంపైనే ఆధారపడుతున్నారు.ప్రపంచ భూభాగంలో భారత్ కేవలం 2.4% మాత్రమే ఉన్నప్పటికీ, ప్రపంచంలోని మొత్తం జీవులలో దాదాపు 7% నుండి 8% ఇక్కడే ఉన్నాయి. ఇంతటి సంపన్నమైన మన జీవవైవిధ్యం నేడు కాలుష్యం, అడవుల నరికివేత, వాతావరణ మార్పుల వల్ల తీవ్ర ప్రమాదంలో పడింది. సాంకేతికంగా మనం ఎంత ఎదిగినా.. నీరు, ఆహారం, మందులు వంటి ప్రాథమిక అవసరాల కోసం ప్రకృతిపై ఆధారపడక తప్పదు.ఈ సమస్యపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ఐక్యరాజ్యసమితి ప్రతి ఏటా ‘అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని’ నిర్వహిస్తోంది. ప్రకృతి నష్టాన్ని నివారించడం కోసం 2022లో ‘కున్మింగ్–మాంట్రియల్ గ్లోబల్ బయోడైవర్సిటీ ఫ్రేమ్‌వర్క్’ ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం 2030 నాటికి దెబ్బతిన్న పర్యావరణ వ్యవస్థల్లో 30 శాతాన్ని పునరుద్ధరించాలని, భూమి మరియు జలవనరులను రక్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.జీవవైవిధ్యాన్ని కాపాడటం అనేది కేవలం ప్రభుత్వాల బాధ్యత కాదు, సమస్త మానవాళి ఉమ్మడి కర్తవ్యం. ఈ అంతర్జాతీయ లోగోలోని ‘వేలిముద్ర’ సూచించినట్లుగా.. పర్యావరణ పరిరక్షణ కోసం క్షేత్రస్థాయిలో మనం చేసే ప్రతి చిన్న ప్రయత్నమూ అమూల్యమైనదే. లోగోలోని ప్రతి రంగు ఒక నిర్దిష్ట పర్యావరణ లక్ష్యానికి నిదర్శనం. విడివిడిగా కనిపించే ఈ రంగులన్నీ కలిసికట్టుగా ఒకే వేలిముద్రగా మారడం దేనికి సంకేతమంటే---ప్రకృతి రక్షణకు సంబంధించిన ఏ ఒక్క లక్ష్యాన్ని కూడా మనం విస్మరించలేము, వాటన్నింటినీ ఒక సమగ్ర ప్రణాళికగా అమలు చేయాల్సిందే. ప్రకృతితో మమేకమై జీవించడం కోసం మన వంతుగా స్థానిక కృషిని అందిస్తూ, భూమిని కాపాడుకునే ఈ చారిత్రాత్మక ప్రయాణంలో మనమూ భాగస్వాములవుదాం.

## ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలసిన ఎఫ్ఆర్వో



**పలమనేరు, ఆంధ్రనాడు, మే 21:** పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని ఎఫ్ఆర్వో చంప్లా నాయక్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలమనేరు ఎఫ్ఆర్వో గా పనిచేసిన నారాయణ ఈ మధ్యకాలంలో పదవీ విరమణ పొందారు. దీంతో మడకశిర డిఆర్ఓగా పనిచేస్తున్న చంప్లా నాయక్ పదోన్నతి పై పలమనేరు ఎఫ్ఆర్ఓ గా విధుల్లో చేరారు. దీంతో తొలిసారి స్థానిక ఎమ్మెల్యేను ఆయన తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పుష్పగుచ్ఛమందించి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ ప్రాంత అభివృద్ధి, అటవీ పరిరక్షణ మరియు ప్రజా సమస్యలపై వారు చర్చించారు. తమ శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని ఎఫ్ఆర్ఓ తెలిపారు. ఎమ్మెల్యే సైతం అధికారుల సేవలను అభినందించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో సలాలుద్దీన్, ఎఫ్ఎస్వో సుకుమార్ తో పాటు అటవీ శాఖా సిబ్బంది ఉన్నారు.

## ‘కుర్చీ మడతపెట్టి’తో వైరల్ అయిన కుర్చీతాత కన్నుమూత

**ఆంధ్రనాడు, మే 21:** సోషల్ మీడియాలో “కుర్చీ మడతపెట్టి” అనే ఒక్క డైలాగ్‌తో సంచలనంగా మారిన షేక్ మహ్మద్ పాషా (64) బుధవారం కన్నుమూశారు. నెటిజన్లలో ‘కుర్చీతాత’ లేదా ‘కాలా పాషా’గా ప్రసిద్ధి చెందిన ఆయన మృతి పట్ల సోషల్ మీడియా వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాయి. మంగళవారం మధ్యాహ్నం యూసుఫ్‌గూడలోని కృష్ణకాంత్ పార్క్ సమీపంలో ఎండ తీవ్రతను తట్టుకోలేక పాషా స్పృహ తప్పి పడిపోయారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను యూట్యూబర్ వైజాగ్ సత్య ఇంటికి తరలించారు. అయితే బుధవారం సాయంత్రం ఆరోగ్యం మరింత విషమించడంతో భార్య ఆసియా సుల్తానా ఒడిలోనే ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వరంగల్కు చెందిన పాషా సుమారు నాలుగు దశాబ్దాల క్రితం హైదరాబాద్కు వచ్చి రహ్మత్‌నగర్‌లో స్థిరపడ్డారు. ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో కుటుంబ సంభా షణను వివరిస్తూ ఆయన చెప్పిన “కుర్చీ మడతపెట్టి” అనే డైలాగ్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఒక్కసారిగా గుర్తింపు పొందారు. ఈ పాప్యులారిటీతో మహేశ్ బాబు నటించిన గుంటూరు కారం చిత్రంలోని టైటిల్ సాంగ్‌లో అదే పదాన్ని పాడే అవకాశం దక్కించుకున్నారు. ఆ పాటతో పాషా మరింత ప్రజాదరణ సంపాదించారు. అయితే కొంతకాలంగా మద్యానికి బానిసైన ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పాషాకు భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతి పట్ల పలువురు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, అభిమానులు, నెటిజన్లు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నారు.



# క్యూబాపై అమెరికా మరో కుట్ర

- రావుల్ కాస్ట్రోపై హత్యాభియోగం ఖండించిన క్యూబా
- కరేబియన్ తీరంలో యుద్ధ నౌకల మోహరింపు



**వాషింగ్టన్, హవానా– ఆంధ్రనాడు, మే 21:** 30ఏళ్ళ నాటి ఒక విమాన ప్రమాదానికి సంబంధించి క్యూబా విప్లవ నేత రౌల్ కాస్ట్రోపై హత్యాభియోగాన్ని మోపుతూ అమెరికా బుధవారం నాడు ఒక పత్రాన్ని విడుదల చేసింది. ఈ ఘటన జరిగిన సమయంలో రౌల్ కాస్ట్రో రక్షణ మంత్రిగా వున్నారు. దాడికి ఆదేశాలిచ్చింది ఆయనేనని అమెరికా ఆరోపిస్తోంది. దీంతో అమెరికా, క్యూబాల మధ్య ఉద్రికత్తలు ఒక్కసారిగా పెచ్చరిల్లాయి.

**అసలేం జరిగింది?**

1996లో రెండు పౌర విమానాల కూలిపోయాయి. ఈ ఘటనల్లో నలుగురు చనిపోగా.. వారిలో ముగ్గురు అమెరికన్లు. అంతర్జాతీయ గగనతలంలో రెండు క్యూబా మిగ్ ఫైటర్లు ఈ దాడులు చేసినట్లు అమెరికా ఆరోపిస్తుంది. తన సోదరుడు ఫిడెల్ క్యాస్ట్రోతో కలిసి రౌల్ క్యాస్ట్రో గెరిల్లా యుద్ధం చేసి నియంత బాటిస్టా ప్రభుత్వాన్ని కూలదోసాడు. అనంతరం క్యూబాపై అమెరికా కుట్రలను తిప్పికొట్టడంలో రౌల్ కాస్ట్రో కీలక పాత్ర వహించారు. దీంతోపాటు 1961లో క్యూబాను ఆక్రమించేందుకు అమెరికా చేపట్టిన ‘బేఆఫ్ పిగ్స్’ ఆపరేషన్ విఫలం చేసింది కూడా రౌల్ క్యాస్ట్రోనే. క్యూబా రక్షణమంత్రిగా, ఫిడెల్ తరువాత అధ్యక్షుడిగా పనిచేశారు.

**క్యూబా ఎప్పటికీ లొంగదు : డియాజ్ కానెల్**

కాగా ఈ పరిణామాలపై క్యూబా అధ్యక్షుడు మిగ్వెల్ డియాజ్ కానెల్ తీవ్రంగా స్పందించారు. రాల్ కాస్ట్రోపై అమెరికా అభిశంసనను తీవ్రంగా ఖండించారు. ఇదంతా రాజకీయ దురుద్దేశంతో చేస్తున్నదేనని, తద్వారా క్యూబాపై ఒత్తిడి పెంచాలని అమెరికా యోచిస్తోందని విమర్శించారు. ఇవన్నీ రాజకీయ కవ్వింపు చర్యలని అన్నారు. క్యూబాపై సైనిక చర్య చేపట్టడానికి ఒక సాకుగా దీన్ని తెరపైకి తీసుకువచ్చారని మిగ్వెల్ విమర్శించారు. ఈ ఘటనకు తమకెలాంటి సంబంధం లేదని, ఆ విమానాలు తమ గగనతలాన్ని ఉల్లంఘించాయని క్యూబా దీర్ఘకాలంగా చెబుతూ వస్తోంది. పైగా విమానాలను కూల్చివేయాలని తాను గానీ రాల్ కాస్ట్రోగానీ ఆదేశాలివ్వలేదని అప్పటి అధ్యక్షుడు ఫిడెల్ కాస్ట్రో కూడా స్పష్టం చేశారు. అమెరికా, క్యూబాల మధ్య ఇప్పటికే నెలకొన్న శతృత్వాన్ని సమర్ధించుకునేందుకు ఎప్పుడో 30ఏళ్ళనాటి విమానం కూల్చివేత సంఘటనను తవ్వుతున్నారని క్యూబా నేతలు విమర్శించారు. ఆనాటి ఘటనలో నలుగురు అమెరికన్లు మరణించారు. ఇరాన్ తర్వాత ఇక క్యూబాదే వంతు అంటూ గత కొంతకాలంగా ట్రంప్ చెప్పుకుంటూ వస్తున్నారు. అయితే ప్రస్తుత తరుణంలో క్యూబాపై దాడి వల్ల ట్రంప్ మరింత ప్రజాదరణ కోల్పోవడం తప్ప జరిగేదేమీ లేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**కరేబియన్ సముద్రంలో యుద్ధ నౌక మోహరింపు..**

ఈ ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో, అమెరికా నౌకాదళానికి చెందిన భారీ విమాన వాహక నౌక యుఎస్ఎస్ నిమిట్జ్ తన స్ట్రైక్ గ్రూప్‌తో కరేబియన్ సముద్రానికి చేరుకుంది. కరేబియన్, లాటిన్ అమెరికాలో అమెరికా సైనిక కార్యకలాపాలను పర్యవేక్షించే యుఎస్ సదరన్ కమాండ్ (సౌత్‌కామ్) బుధవారం ఈ విషయాన్ని వెల్లడించింది. ఇటీవలే ఈ యుద్ధనౌక రియో డి జనీరో తీరంలో బ్రెజిల్ నౌకాదళంతో కలిసి సంయుక్త నావికా విన్యాసాలు నిర్వహించింది. అయితే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడుతూ, “ఇది చాలా ముఖ్యమైన విషయం.

ఇది కేవలం క్యూబన్–అమెరికన్లకే కాకుండా, క్యూబా నుండి వచ్చి తమ కుటుంబాల వద్దకు తిరిగి వెళ్లాలనుకుంటున్న వారికి కూడా ఒక మంచి సందర్భం” అంటూ బెదిరించారు.

మరోవైపు క్యూబన్–అమెరికన్ అయిన అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, క్యూబా ప్రజలకు స్పానిష్ భాషలో ఒక సందేశాన్ని జారీ చేశారు. దానిలో ఆయన క్యూబాపై అమెరికా విధించిన ఇంధన ఆంక్షలను సమర్ధించారు.

కొనసాగుతున్న విద్యుత్ కోతలకు క్యూబా కమ్యూనిస్ట్ ప్రభుత్వమే కారణమంటూ చెప్పుకొచ్చారు. అయితే ప్రపంచాన్ని అనేక సార్లు ధ్వంసం చేసే ఆయుధ సంపత్తి కలిగిన అమెరికా, క్యూబా కేవలం ఇటీవల 300 డ్రోనులను కొనుగోలు చేసిందని, ఇది అమెరికా భద్రతకు ముప్పు అని భావించడం హాస్యాస్పదమని పలువురు నిపుణులు విమర్శిస్తున్నారు.

## గుడివాడలో సంచలనం..
## శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ బంగారు కిరీటం తాకట్టు!



**ఆంధ్రనాడు, మే 21:** శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కోటి రూపాయల విలువైన బంగారు కిరీటం మాయమై తాకట్టు పెట్టిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపుతోంది. ఈ వ్యవహారంపై దేవదాయ శాఖ ఉన్నత స్థాయి విచారణ ప్రారంభించింది. సమాచారం అందుకున్న దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ లలిత హుటాహుటిన ఆలయానికి చేరుకుని అర్చకులు, సిబ్బందితో మాట్లాడి వివరాలు సేకరించారు. దేవస్థానం ట్రస్ట్ కార్యాలయం తాళాలు తెరిపించి కీలక రికార్డులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అయితే ముందస్తు సమాచారం ఇచ్చినప్పటికీ ట్రస్ట్ బోర్డులోని 31 మంది సభ్యుల్లో ఒక్కరు కూడా విచారణకు హాజరుకాకపోవడం అధికారులను ఆశ్చర్యానికి గురి చేసింది. పలువురు సభ్యులు ఫోన్లలో దాటవేత సమాధానాలు చెప్పడంపై అసిస్టెంట్ కమిషనర్ లలిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. విచారణలో భాగంగా కిరీటాన్ని విరాళంగా అందించిన దాత కుటుంబ సభ్యులను కూడా అధికారులు కలిసి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆలయ కమిటీ దేవదాయ శాఖ ప్రత్యక్ష పరిధిలో లేకపోవడంతో తక్షణ చర్యలు తీసుకోవడంలో పరిమితులు ఉన్నాయని, రికార్డుల పరిశీలన అనంతరం తదుపరి చర్యలు ఉంటాయని లలిత వెల్లడించారు. మధ్యాహ్నంలోపు ఉన్నతాధికారులకు ప్రాథమిక నివేదిక సమర్పించాల్సి ఉండటంతో ఆలయంలోనే ఉండి విచారణను ముమ్మరం చేశారు. ఇదిలా ఉండగా, స్వామివారి బంగారు కిరీటాన్ని తాకట్టు పెట్టుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బంగారు వ్యాపారి ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. తన ఖాతాకు జమ చేసిన డబ్బులు తిరిగి చెల్లిస్తేనే ఊరికి వస్తానని అతడు ట్రస్ట్ బోర్డుకు సమాచారం పంపినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఘటనపై స్పందించిన యలవర్తి శ్రీనివాసరావు ఆలయానికి చేరుకుని ట్రస్ట్ బోర్డు తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. “స్వామివారి ఆస్తితో వ్యాపారం చేస్తూ భక్తుల మనోభావాలతో చెలగాటమాడితే సహించము. సాయంత్రంలోగా బంగారు కిరీటాన్ని తిరిగి తెచ్చి స్వామివారికి అలంకరించాలి. లేకపోతే భక్తులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం” అని హెచ్చరించారు. అక్రమ తాకట్టు వ్యవహారంలో బాధ్యులైన ట్రస్ట్ సభ్యులతో పాటు బంగారు వ్యాపారిపై కూడా కఠిన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనతో గుడివాడ పట్టణ ప్రతిష్ఠ దెబ్బతింటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఏపీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు కొత్త పాలకమండలి

- చైర్మన్‌గా పి. భరత్ భూషణ్..
- వైస్ చైర్మన్‌గా మెహర్ రమేష్ నియామకం



**ఆంధ్రనాడు, మే 21:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్, నాటకరంగ అభివృద్ధి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నూతన పాలకమండలిని నియమించింది. సంస్థ ఛైర్మన్‌గా తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు, ప్రముఖ సినీ పంపిణీదారుడు పి. భరత్ భూషణ్ను నియమిస్తూ గురువారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే వైస్ ఛైర్మన్‌గా ప్రముఖ సినీ దర్శకుడు మెహర్ రమేష్ (చిక్కాల మెహర్ రమేష్ కుమార్) నియమితులయ్యారు. గత రెండేళ్లుగా ఖాళీగా ఉన్న ఏపీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని ప్రభుత్వం భర్తీ చేయడంతో సినీ వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందర్భంగా మొత్తం 14 మందిని డైరెక్టర్లుగా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కొత్త పాలకమండలి నియామకాలతో సంస్థ కార్యకలాపాలకు మరింత వేగం, ఉత్తేజం లభిస్తాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. డైరెక్టర్లుగా నియమితులైన వారిలో ప్రముఖ సినీ రచయిత బుర్రా సాయి మాధవ్, చిలకలూరిపేటకు చెందిన రిటైర్డ్ అధ్యాపకులు, రచయిత డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు ఉన్నారు. నటుల విభాగంలో సీనియర్ నటుడు సుమన్, నటుడు శివాజీ, నటి ఝాన్సీలకు డైరెక్టర్లుగా అవకాశం కల్పించారు. దర్శకుల విభాగంలో ప్రముఖ దర్శకులు ఎస్.వి. కృష్ణారెడ్డి, వి. సముద్రలకు చోటు దక్కింది. నిర్మాతల విభాగంలో చదలవాడ శ్రీనివాసరావు, కూచిభోట్ల వివేకానందలను డైరెక్టర్లుగా నియమించారు. అదేవిధంగా సీనియర్ జర్నలిస్ట్ కె. ఉమా మహేశ్వరరావుతో పాటు మీర్ ఎస్., ఎ. సత్యనారాయణ, జి. రాజ్ వెంకటేశ్వర యాదవ్, డి. సత్యనారాయణలను కూడా డైరెక్టర్ల బృందంలో చేర్చారు. సినిమా, టెలివిజన్, నాటకరంగాలకు చెందిన అనుభవజ్ఞులను పాలకమండలి లోకి తీసుకోవడం ద్వారా రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కొత్త పాలకమండలి ఆధ్వర్యంలో రాష్ట్రంలో చిత్ర పరిశ్రమ అభివృద్ధి, ఫిల్మ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, షూటింగ్ సదుపాయాల విస్తరణ, యువ ప్రతిభకు ప్రోత్సాహం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# గుజరాత్ దెబ్బకు చెన్నై కథ సమాప్తం...
# ఐపీఎల్-2026 నుంచి సీఎస్కే ఔట్

- చెన్నైపై 89 పరుగుల భారీ తేడాతో గుజరాత్ టైటాన్స్ విజయం
- ఈ ఓటమితో ప్లే ఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించిన సీఎస్కే
- గిల్, సాయి సుదర్శన్, బట్లర్ అర్ధశతకాలతో గుజరాత్ భారీ స్కోరు
- లక్ష్య ఛేదనలో 140 పరుగులకే కుప్పకూలిన చెన్నై సూపర్ కింగ్స్
- బౌలింగ్‌లో సిరాజ్, రబాడ, రషీద్ ఖాన్ మూడేసి వికెట్లతో చెలరేగారు



ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) ప్రస్థానం ముగిసింది. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో 89 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలై ప్లే ఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. ఈ విజయంతో గుజరాత్ ప్లే ఆఫ్స్‌లో టాప్–2 స్థానాన్ని దాదాపు ఖాయం చేసుకుంది.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ టైటాన్స్‌కు ఓపెనర్లు శుభ్‌మన్ గిల్ (37 బంతుల్లో 64), సాయి సుదర్శన్ (53 బంతుల్లో 84) అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 125 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. ఆ తర్వాత వచ్చిన జాస్ బట్లర్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 27 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 57 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీంతో గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 229 పరుగుల భారీ స్కోరు సాధించింది.

230 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో చెన్నై సూపర్ కింగ్స్ ఆది నుంచే తడబడింది. ఇన్నింగ్స్ తొలి బంతికే సంజూ శాంసన్ డకౌట్ అయ్యాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (16) మెరుపులు తాత్కాలికమే అయ్యాయి. మహమ్మద్ సిరాజ్ తన తొలి ఓవర్లలోనే కీలక వికెట్లు పడగొట్టి చెన్నైని కోలుకోలేని దెబ్బ తీశాడు. శివమ్ దూబే (17 బంతుల్లో 47) ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో చెన్నై 13.4 ఓవర్లలో 140 పరుగులకే కుప్పకూలింది. గుజరాత్ బౌలర్లలో మహమ్మద్ సిరాజ్, కగిసో రబాడ, రషీద్ ఖాన్ తలా మూడు వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.

## అతడ్ని సచిన్ వారసుడు అనకండి: దినేశ్ కార్తీక్

యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని సచిన్‌తో పోల్చవద్దన్న దినేశ్ కార్తీక్ ఐపీఎల్ 2026లో 15 ఏళ్ల వైభవ్ అద్భుత ప్రదర్శనవైభవ్‌కు మైదానం బయట సవాళ్లే ఎక్కువగా ఉంటాయని డీకే



అభిప్రాయంఐపీఎల్ స్వరూపం పూర్తిగా మారిపోయిందని వ్యాఖ్యప్రస్తుతం ఆర్సీబీకి బ్యాటింగ్ కోచ్, మెంటార్‌గా ఉన్న దినేశ్ కార్తీక్ భారత మాజీ వికెట్ కీపర్, బ్యాటర్ దినేశ్ కార్తీక్.. 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్‌తో పోల్చవద్దని సూచించాడు. అద్భుత ప్రతిభ కనబరుస్తున్న ఆ కుర్రాడిపై అనవసరమైన పోలికలతో భారం మోపవద్దని, అతడికి ఎదురయ్యే సవాళ్లు విలక్షణంగా ఉంటాయని హితవు పలికాడు. సచిన్ వారసుడ అతడే అనడం ఏమంత సమంజసం కాదని అభిప్రాయపడ్డాడు.

ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతున్న లెఫ్ట్ హ్యాండ్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ, ఇప్పటివరకు 13 మ్యాచ్‌లలో 579 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ముఖ్యంగా, 236.32 స్ట్రైక్ రేట్‌తో విధ్వంసకర బ్యాటింగ్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు.

ఈ నేపథ్యంలో ఐకూ క్వెస్ట్ టాక్ పాడ్‌కాస్ట్‌లో కార్తీక్ మాట్లాడుతూ, "వైభవ్ బ్యాటింగ్ ప్రదర్శన చాలా ప్రత్యేకం. కానీ ప్రజలు అతడిని 'సచిన్ వారసుడు' అని ట్యాగ్ చేయొద్దని కోరుకుంటున్నాను. సచిన్ సాధించింది అసాధారణం. వైభవ్‌కు ఎదురయ్యే సవాళ్లు పూర్తిగా భిన్నంగా ఉంటాయి. సచిన్‌కు మైదానంలో, బయట సవాళ్లు ఎదురైతే, వైభవ్‌కు మాత్రం మైదానం బయటే ఎక్కువ సవాళ్లు ఉంటాయి. ఎందుకంటే అతడికి అద్భుతమైన క్రికెట్ నైపుణ్యాలు ఉన్నాయి, కానీ క్రీడకు సంబంధం లేని బయటి విషయాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని వివరించాడు.

ఇదే సందర్భంగా ఐపీఎల్ ప్రస్థానం గురించి కూడా కార్తీక్ మాట్లాడాడు. "2008లో ప్రారంభమైన ఐపీఎల్‌కు, ఇప్పటికి చాలా తేడా ఉంది. డేటా, గణాంకాల వాడకం విపరీతంగా పెరిగింది. ఇది ఎందరికో జీవనశైలిని అందిస్తూ, యువ క్రీడాకారులకు బలమైన కెరీర్ ఆప్షన్‌గా మారింది. అతి తక్కువ కాలంలోనే ప్రపంచంలోని ఇతర క్రీడా టోర్నమెంట్‌లతో పోటీ పడుతోంది" అని అన్నాడు.

# పొలిటికల్ ఎంట్రీపై
# తిరుగులేని క్లారిటీ ఇచ్చిన రామ్ చరణ్

- రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదని స్పష్టం చేసిన రామ్ చరణ్
- చిత్ర పరిశ్రమలో నంబర్ వన్ కావడమే తన లక్ష్యమని వెల్లడి
- 'పెద్ది' తన కెరీర్‌లో ఎంతో నిజాయతీగా చేసిన చిత్రమని వ్యాఖ్య
- డూప్ లేకుండా స్టంట్స్ చేయడం తనకిష్టమని, తండ్రే స్ఫూర్తి అని వెల్లడి
- బుచ్చిబాబు దర్శకత్వంలో 'పెద్ది' జూన్ 4న పాన్ ఇండియా స్థాయిలో విడుదల



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తన రాజకీయ ప్రవేశంపై వస్తున్న ఊహాగానాలకు స్పష్టత ఇచ్చారు. తనకు రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదని, సినిమా రంగంలో అగ్రస్థానానికి చేరడమే తన లక్ష్యమని తేల్చి చెప్పారు. తన తాజా చిత్రం 'పెద్ది' ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు.

"అభిమానులు మిమ్మల్ని సీఎంగా చూడాలను కుంటున్నారు, మీరు రాజకీయాల్లోకి వస్తారా?" అన్న ప్రశ్నకు చరణ్ బదులిస్తూ.. "రెండు పడవలపై ప్రయాణం చేయాలనుకోవడం లేదు. నా పూర్తి దృష్టి నటనపైనే ఉంది... నటనా రంగంలో మేటిగా నిలవడంపైనే నా దృష్టంతా!" అని అన్నారు.

తన కొత్త సినిమా 'పెద్ది' గురించి మాట్లాడుతూ, ఇది తన కెరీర్‌లో ఎంతో నిజాయతీగా చేసిన చిత్రమని తెలిపారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో, తన అస్తిత్వాన్ని వెతుక్కునే 'పెద్ది' అనే యువకుడిగా కనిపిస్తానని వివరించారు. ఈ పాత్ర కోసం శారీరకంగా, మానసికంగా ఎంతో కష్టపడ్డానని చెప్పారు. క్రీడా నేపథ్య డ్రామాగా వస్తున్న ఈ సినిమా

తప్పకుండా

ఆకట్టుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

రిస్కీ షాట్‌లలో డూప్‌ల సహాయం లేకుండా నటించడానికే ఇష్టపడతానని, తన తండ్రి చిరంజీవి 71 ఏళ్ల వయసులో కూడా స్టంట్స్ చేస్తున్నారని, అలాంటి సన్నివేశాలు ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతాయని రామ్ చరణ్ పేర్కొన్నారు. బుచ్చిబాబు దర్శకత్వం వహించిన 'పెద్ది' చిత్రం జూన్ 4న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.




## చిరు నయా సినిమా షురూ

'వాల్తేర్ వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తరువాత చిరంజీవి, డైరెక్టర్ బాబీ కొల్లి క్రేజీ కాంబోలో తెరకెక్కుతున్న నయా సినిమా గురువారం ఆరంభమైంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాత వెంకట్ కె నారాయణ నిర్మిస్తున్నారు. కన్నడ, తమిళ, హిందీ భాషల్లో పలు భారీ ప్రాజెక్టులను అందించిన కేవీఎన్ ప్రొడక్షన్స్ తెలుగులో నిర్మిస్తున్న తొలి చిత్రం ఇది. ఇప్పటికే వరుస అప్డేట్స్‌తో భారీ అంచనాలు సృష్టించిన ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది.

పవన్ కళ్యాణ్, నాగబాబు ముఖ్య అతిథులుగా విచ్చేసి ఈ కార్యక్రమాన్ని మరింత వైభవంగా మార్చారు. ఈ మెగా త్రయం వేదికను పంచుకోవడం అభిమానులకు కనులవిందు చేసింది. పవన్ కళ్యాణ్ క్లాప్‌బోర్డ్ కొట్టగా, సుష్మిత కొణిదెల కెమెరా స్విచ్ ఆన్ చేశారు. వి.వి. వినాయక్ ఫస్ట్ షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు.

బి. గోపాల్, కోదండరామి రెడ్డి, నాగబాబు చిత్ర బృందానికి స్క్రిప్ట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖ దర్శకులు, నిర్మాతలు హాజరయ్యారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ నుంచి లోహిత్ తన బృందంతో కలిసి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. దర్శకుడు బాబీ కొల్లి ఈసారి మరింత భారీ కథను సిద్ధం చేశారు. మ్యాసీవ్ స్కేల్, ఇంటెన్సిటీ తో నిండిన ఈ కథలో చిరంజీవి తన కెరీర్‌లోనే అత్యంత పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు.

ఈ చిత్రంలో మలయాళ నటి అనస్వర రాజన్ కీలక పాత్రలో నటించనున్నారు. చిరంజీవి నటిస్తున్న ఈ 158వ సినిమా రెగ్యులర్ షూటింగ్ నేటి (శుక్రవారం) నుంచి హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది. ఈ సినిమాకి రచన, దర్శకత్వం: బాబీ కొల్లి, నిర్మాత: వెంకట్ కె నారాయణ, సంగీతం: థమన్ ఎస్, స్క్రీన్ ప్లే రైటర్స్: కోన వెంకట్, కె చక్రవర్తి రెడ్డి, అడిషినల్ స్క్రీన్ ప్లే రైటర్స్: హరి మోహన కృష్ణ, వినీత్ పొట్లూరి, డీఓపీ : విజయ్ కార్తీక్ కన్నన్, ఎడిటర్: ఆంటోనీ రూబెన్, ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శరణ్య పోట్ల.



# ఎస్వీ గోశాలలో నెయ్యి తయారీ కేంద్రం పనుల పరిశీలన

## - జూలకి సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్, నెయ్యి తయారీ కేంద్రం పనులు పూర్తి చేయాలి : టిటిడి జేఈవో (వైద్యం, విద్య) డా. ఎ. శరత్



**తిరుపతి-ఆంధ్రనాడు,మే 21:** తిరుపతిలోని టిటిడి ఎస్వీ గోశాలలో నిర్మాణంలో ఉన్న నెయ్యి తయారీ కేంద్రం, సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ పనులను టిటిడి జేఈవో (వైద్యం, విద్య) డా.ఎ.శరత్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ... టిటిడి ఈవో ఎం. రవిచంద్ర ఆదేశాల మేరకు పెండింగ్ పనులను సమీక్షించామని తెలిపారు. నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో చేపడుతున్న సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ పనులను,చివరి దశలో ఉన్న నెయ్యి తయారీ కేంద్రం పెండింగ్ పనులు జూలై నెలాఖరు నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్వీ గోశాలలో రోజుకు సుమారు 2 వేల లీటర్ల పాలను ప్రాసెస్ చేసే సామర్థ్యంతో ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎస్వీ గోశాల నుండి సేకరించే పాలను వినియోగించి స్వామివారి కైంకర్యాలు, సేవల కోసం పాలు, పెరుగు, నెయ్యి తదితర ఉత్పత్తులను టిటిడి స్వయంగా తయారు చేసేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.అదేవిధంగా, నెయ్యి తయారీ ప్లాంట్ పనులు ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయని, వెంటనే ట్రయల్ రన్ నిర్వహించి మిగిలిన పనులను పూర్తి చేయాలని సూచించారు. పాలు ఇచ్చే దేశీయ ఆవులను మరింతగా సమీకరించేందుకు చర్యలు చేపట్టాలని, టిటిడి తరపున చేపట్టాల్సిన నీరు, విద్యుత్, ఫ్యాన్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, లైటింగ్, సైన్ బోర్డులు తదితర మౌలిక వసతుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా మజ్జిగ, వెన్న తయారీ అనంతరం వెన్న నుండి నెయ్యి ఉత్పత్తి చేసే ప్రక్రియలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్వామివారి ధూప, దీప, నైవేద్య కార్యక్రమాలకు వినియోగించే నెయ్యిని ఎస్వీ గోశాల నుండే సరఫరా చేసేలా పటిష్ట వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఈ యూనిట్ ద్వారా రోజుకు 2 వేల లీటర్ల పాల నుండి సుమారు 80 కిలోల నెయ్యి తయారు చేసే అవకాశం ఉందని, దశలవారీగా యూనిట్ సామర్థ్యాన్ని 10 వేల లీటర్ల వరకు పెంచే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని జేఈవో వెల్లడించారు.ఈ కార్యక్రమంలో టిటిడి ఎస్వీ గోశాల డైరెక్టర్ డా. ఏవీఎన్ శివకుమార్, ఎస్ఈలు వేంకటేశ్వర్లు, మనోహరం, ఈఈ ప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# తుడా చైర్మన్‌గా ఏడాది పూర్తి

## - కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటిన డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి





**తిరుపతి-ఆంధ్రనాడు,మే 21:** తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా, తుడా చైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి గురువారం తుడా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు.పచ్చదనాన్ని పెంపొందించడానికి, పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి తుడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని చైర్మన్ తెలిపారు.అందులో భాగంగానే ఈ మైలురాయిని స్వయంగా మొక్కలు నాటే కార్యక్రమంతో ప్రారంభించినట్లు పేర్కొని,ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తుడా ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ప్లానింగ్ అధికారులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# డా. వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల ఎంపికలకు దరఖాస్తుల ఆహ్వానం

**తిరుపతి-ఆంధ్రనాడు,మే 21:** ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో కడపలో నిర్వహిస్తున్న డా. వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి 4వ తరగతి నుండి 9వ తరగతి వరకు ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతి జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎన్. శశిధర్ తెలిపారు.4వ నుండి 6వ తరగతుల ప్రవేశాల కోసం జిల్లా స్థాయి మరియు రాష్ట్ర స్థాయి ఎంపిక పరీక్షలు రెండు దశల్లో నిర్వహించబడతాయి. 7 నుండి 9వ తరగతుల వరకు రాష్ట్ర స్థాయిలో మాత్రమే ఎంపిక పరీక్షలు నిర్వహించ బడనున్నాయి.ఈ క్రీడా పాఠశాలలో అథ్లెటిక్స్, ఆర్చరీ, బాక్సింగ్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హాకీ, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్ తదితర క్రీడల్లో నైపుణ్య శిక్షణతో పాటు ఆంగ్ల మాధ్యమంలో విద్య అందించబడుతుంది. ఆసక్తి మరియు అర్హత కలిగిన విద్యార్థులు వచ్చే నెల 2వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.పూర్తి సమాచారం కోసం https:// apsportsschool.ap.gov.in/ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు అని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎన్. శశిధర్ తెలిపారు.




Printed, Published Edited and Owned by M.HARIBABU, Printed at AKSHARA PRINTERS, 1st Floor, SSS Complex, Air Bypass Road, Tirupati Town, Tirupati District, A.P., Published at AKSHARA PUBLICATIONS, Tirupati, Editor : M.Hari Babu , Cell : 9490400684, RNI: 2009/28733